ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 03 సంచిక -121 పేజీలు - 04 వెల - 04/- గురువారం 4 జూన్ 2026



## డీఎస్సీ అభ్యర్థులకు జగన్ భరోసా

**ఉచిత న్యాయ సహాయం, కోర్టు ఖర్చుల బాధ్యత వైసీపీదే..**

**డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణకు డిమాండ్ చేశామన్న జగన్**

**వైసీపీ అధికారంలోకి రాగానే అక్రమాలపై రీ-ఎంక్వైరీ చేయిస్తామని వెల్లడి**

**క్రీడా కోటా ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో పారదర్శకత లోపించిందని విమర్శ**

**జూన్ 03 ఆంధ్ర ప్రగతి**
డీఎస్సీ పరీక్షల్లో తీవ్ర అన్యాయం జరిగిందంటూ ఆందోళన చెందుతున్న అభ్యర్థులకు తమ మద్దతు ఉంటుందని వైసీపీ అధినేత జగన్ ప్రకటించారు. బాధితుల పక్షాన నిలిచి వారికి అవసరమైన ఉచిత న్యాయ సహాయాన్ని అందిస్తామని, కోర్టు ఖర్చులన్నింటినీ తమ పార్టీయే భరిస్తుందని ఆయన **మిగతా 2లో...**

# త్వరలో డిజిటల్ హెల్త్ రికార్డులు

**సంపూర్ణ ఆరోగ్యం ఉన్నవారే నిజమైన ధనవంతులు**

**యోగా, ధ్యానం చేస్తే అనారోగ్యం దరిచేరదు**

**21న కృష్ణా తీరంలో యోగా ప్రదర్శనలు**

**సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడి**

**గుంటూరు,జూన్ 03 ఆంధ్ర ప్రగతి**
ఎంత సంపద ఉన్నా.. ఆరోగ్యం అవసరమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. సంపూర్ణ ఆరోగ్యం ఉన్నవారే నిజమైన ధనవంతులని పేర్కొన్నారు. బుధవారం గుంటూరు జిల్లాలోని తక్కెళ్లపాడులో సీఎం చంద్రబాబు పర్యటించారు. లలిత ఆస్పత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం ప్రసంగించారు. వేల కోట్లు, పదవులు ఉన్నా ఆరోగ్యం లేకపోతే లాభంలేదని చెప్పుకొచ్చారు. లలిత ఆస్పత్రి.. ల్యాండ్‌మార్క్ ఇన్‌స్టిట్యూట్‌గా తయారు కావాలని ఆకాంక్షించారు. ఈ హాస్పిటల్లోని స్కానర్ సౌత్ **మిగతా 2లో...**



## కర్నాటక సిఎంగా డికె శివకుమార్ ప్రమాణం


**ఉపముఖ్యమంత్రిగా జి. పరమేశ్వర్**

**మొత్తం 13 మంది మంత్రుల ప్రమాణం**

**సిద్ధరామయ్య, ఖర్గేల తనయులకు కేబినేట్‌లో చోటు**

**కార్యక్రమానికి హాజరైన రాహుల్, ఖర్గే, వేణుగోపాల్ , రేవంత్ రెడ్డి**

**బెంగళూరు,జూన్ 03 ఆంధ్ర ప్రగతి**
కర్ణాటక ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నేత డీకే శివకుమార్ ప్రమాణస్వీకారం చేశారు. లోక్‌భవన్‌లో బుధవారం సాయంత్రం 4.05 గంటలకు ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. డీకే శివకుమార్‌తో గవర్నర్ తావర్‌చంద్ గెహ్లాట్ ప్రమాణస్వీకారం చేయించారు. ఆయనతో పాటు మరో 13 మంది ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. సిద్ధరామయ్య ప్రభుత్వంలో హోం మంత్రిగా ఉన్న జి.పరమేశ్వర కర్ణాటక పముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. రాజ్యాంగం మినీబుక్‌ను చేతబట్టి డీకే ప్రమాణస్వీకారం చేశారు.
**మిగతా 2లో...**



## ఆన్‌లైన్ బెట్టింగ్ కు రాజ్యాంగ రక్షణ లేదు

**సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ**




## కులదూషణలు దారుణం

**అమరజీవి పొట్టి శ్రీరాములుకు కూడా తప్పని కులచట్రం**

**ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర ఆవేదన**

**అమరావతి,జూన్ 03 ఆంధ్ర ప్రగతి**
భాష ప్రయుక్త రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు వంటి మహనీయులను కూడా నేడు కుల చట్రాల్లో బంధించడానికి సగటు రాజకీయ ఆలోచనలు చేస్తున్నారని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అమరావతిలో అమరజీవి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశించిన కుల నిర్మూలన పక్కనబెడితే.. 1989 నుంచి రాజకీయాల్లో కుల దూషణలు విపరీతంగా పెరిగిపోయాయని మండిపడ్డారు. కొంతమంది స్వార్థపరులు**మిగతా 2లో...**



## భారత్‌పై అమెరికా మళ్లీ టారిఫ్స్..

**వెట్టిచాకిరి చేయించి ఉత్పత్తులు తయారుచేయించారని అమెరికా ఆరోపణ**

**అందుకుగానూ 12.5 శాతం పన్ను విధించాలని ప్రతిపాదన**

**ఇది ఇంకా ఖరారు కాలేదని కేంద్రం ప్రభుత్వం వివరణ**

**వాణిజ్య ఒప్పందం దిశగా చర్చలు సాగుతున్నట్లు వెల్లడి**




## టెక్నాలజీ తదితర రంగాల్లో పరస్పర సహకారం

**తెలంగాణ, తూరంగియా మధ్య కీలక ఒప్పందం**

**యువతలో నైపుణ్యాలను తీర్చి దిద్దాలన్న సిఎం రేవంత్**

**హైదరాబాద్,జూన్ 03 ఆంధ్ర ప్రగతి**
తెలంగాణ, జర్మనీలోని తూరంగియా రాష్ట్రాల మధ్య కీలక ఒప్పందం కుదిరింది. టెక్నాలజీ, నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్‌లు, లైఫ్ సైన్సెస్ రంగాల్లో పరస్పర సహకారం కోసం తెలంగాణ ప్రభుత్వం, థురింగియా రాష్ట్ర ప్రభుత్వం మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. జర్మనీ తురింగియా రాష్ట్ర సీఎం మారియో వోయిట్ నేతృత్వంలోని ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం హైదరాబాద్‌లో సీఎం ఎ. రేవంత్ రెడ్డితో బుధవారం ప్రత్యేకంగా సమావేశం కాగా, ఈ భేటీలో రాష్ట్ర



ఐటీ, పరిశ్రమల శాఖల దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, కార్మిక శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... ప్రపంచవ్యాప్తంగా ఉపాధి రంగంలో భారీ మార్పులు **మిగతా 2లో...**



## పెట్టుబడుల వేట

**రష్యా పర్యటనలో పలు సంస్థల ప్రతినిధులతో లోకేశ్ భేటీ**

**కెమికల్ సంస్థ రస్‌కెమ్ గ్రూపు సిఇవోతో చర్చలు**

**రిటైల్ బ్యాంకింగ్ సంస్థ స్బేర్‌బ్యాంక్ ప్రతినిధులతో సమాలోచనలు**

**మాస్కో,జూన్ 03 ఆంధ్ర ప్రగతి**
రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రష్యాలో పర్యటిస్తున్న రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి లోకేష్, మాస్కోలో కీలక సమావేశం నిర్వహించారు. రష్యాలో గ్యాస్ ఫీల్డ్స్, మిథనాల్ కెమికల్ ప్రాజెక్టులను నిర్వహిస్తున్న ప్రముఖ సంస్థ రస్ కెమ్ గ్రూప్ డిప్యూటీ సీఈఓ ఇల్యా కోసిచ్, అంతర్జాతీయ వ్యాపార విభాగాధిపతి దర్యా అషానియాలతో ఆయన భేటీ అయ్యారు.**మిగతా 2లో...**

# ఢిల్లీలో ఘోర అగ్ని ప్రమాదం

**40 మందికి గాయాలు మృతుల్లో అత్యధికులు విదేశీయులే**

**సహాయక చర్యల్లో జాప్యంతో భారీ ప్రాణనష్టం**

**భద్రతా ప్రమాణాలు పాటించని భవన యాజమాన్యం - రాష్ట్రపతి, ప్రధాని దిగ్భ్రాంతి**

**న్యూఢిల్లీ :జూన్ 03 ఆంధ్ర ప్రగతి**
దేశ రాజధానిలో బుధవారం ఉదయం ఒక హోటల్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ విషాద ఘటనలో 21 మంది నిండు ప్రాణాలు బుగ్గి అయ్యాయి. మరో 40 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వీరిని సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. సాకేత్‌లోని మాక్స్ ఆస్ప్రతికి 39 మంది తరలించగా..అప్పటికే వారిలో 18 మంది చనిపోయారు. మిగిలినవారికి చికిత్స అందిస్తున్నామని,**మిగతా 2లో...**



## 21 మంది మృతి



# ఢిల్లీలో ఘోర అగ్నిప్రమాదం



మొదటిపేజీ తరువాయి

వీరిలో 8 మంది పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో వెంటిలేటర్ పై చికిత్స అందిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. సకాలంలో సహాయక చర్యలు చేపట్టడంలో జాప్యం చోటుచేసుకోవడం వల్లే భారీ స్థాయిలో ప్రాణ నష్టం జరిగిందన్న విమర్శలు వస్తున్నాయి. బిజెపి డబుల్ ఇంజిన్ సర్కార్ కు ప్రజల ప్రాణాలంటే లెక్కలేదని కాంగ్రెస్, ఆమాద్మీ పార్టీ ఆగ్రహం వ్యక్తం చేశాయి. బాధితుల్లో అత్యధికులు మధ్య ఆసియా, ఆఫ్రికా దేశాలకు చెందినవారు. ఈ విషాద ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ ఘటనకు సంబంధించి హోటల్ యజమానిని పోలీసులు అరెస్టు చేశారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఢిల్లీలోని మాలవీయ నగర్‌లో ఉదయం 8.50గంటల సమయంలో ఫ్లరిష్ స్టే బ్రెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ హోటల్‌లో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఉదయం ఎలక్ట్రిక్ స్టవ్ ఆన్ చేయడానికి ప్రయత్నించగానే మంటలు వచ్చాయని చెఫ్ కేసర్ సింగ్ తెలిపారు. వెంటనే సిబ్బందిని అప్రమత్తం చేశానని, బయటకు వచ్చి చూసేసరికి ఒక్కసారిగా మంటలు హోటల్ అంతా వ్యాపించినట్లు కనిపించిందని తెలిపారు. మంటలు చెలరేగిన సమయంలో సీల్డ్ గాజు కిటికీలు, సెన్సార్‌తో పనిచేసే గేట్ల వల్ల సహాయక సిబ్బంది వెంటనే చర్యలు తీసుకోవడం కూడా ఇబ్బందిగా మారింది. దీనికి తోడు హోటల్‌లో పరిమితికి మించి జనాభా వున్నట్లు తెలుస్తోంది. కిక్కిరిసిన రూములు, పైగా అగ్ని ప్రమాదం జరిగినపుడు తీసుకోవాల్సిన భద్రతా ప్రమాణాలు కూడా హోటల్ యాజమాన్యం ఉల్లంఘించినట్లు తెలుస్తోంది. ఫైర్ నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ ఈ భవనానికి లేదు. దీంతో మొత్తంగా హోటల్ ఒక మృత్యుకూపంగా మారింది. చాలా వేగంగా భవనాన్ని పొగ, మంటలు కమ్ముకోవడంతో డజన్ల సంఖ్యలో లోపలివారు తప్పించుకునే వీలు లేకపోయింది.

సమాచారం తెలిసిన వెంటనే స్థానికులు కిటికీలు బద్దలు కొట్టి, దుప్పట్లు కప్పి లోపల వున్నవారు బయటకు వచ్చేందుకు సాయపడ్డారు. ఐదంతస్తుల ఈ హోటల్ కేంద్ర ప్రభుత్వం నిర్వహించే బ్రెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ పథకం కింద నడుస్తోంది. ఆ లైసెన్స్ ప్రకారం ఆరు గదులకు మాత్రమే అనుమతి వుంటుంది. కానీ భవనం బేస్‌మెంట్, గ్రౌండ్‌ఫ్లోర్, పైన గల ఐదు అంతస్తుల్లో ఏకంగా 25 గదులు వున్నట్లు తెలుస్తోందని అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. పైన టెర్రస్ కూడా వుందని, అన్ని అంతస్తుల్లోనూ గదులు వున్నాయని, ఏదైనా ప్రమాదం జరిగితే బయటపడేందుకు కూడా వీల్లేని రీతిలో అత్యంత అధ్వాన్నంగా ఆ నిర్మాణం వుందని చెప్పారు. అయితే వెంటనే అగ్నిమాపక బృందాలు ఘటనా స్థలికి రావడంలో ఆలస్యమైందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

ఆ హోటల్ భవనానికి ఎదురు భవనంలో వుండే అంజుమ్ అనే మహిళ మాట్లాడుతూ పొద్దునే తన తండ్రికి మందులు ఇవ్వడానికి ఆయన గదిలోకి వెళ్ళేసరికి ఏదో వాసన వచ్చిందని, ఆ వెంటనే ఒక స్పార్క్‌లా వచ్చిందని, భవనం మంటల్లో చిక్కుకుందని తెలిపారు. పెద్ద ఎత్తున పేలుళ్ళ శబ్దాలు కూడా వినిపించాయన్నారు. చాలామంది ప్రాణాలు కాపాడుకోవడానికి పైఅంతస్తుల నుండి కిందకు దూకేశారని తెలిపారు. వీరిలో మహిళలు కూడా వున్నారన్నారు. మృతదేహాలు గుర్తుపట్టడానికి వీల్లేకుండా వున్నాయి. ప్రతి ఒక్కరూ తీవ్రంగా కాలిపోయారని ప్రత్యక్షసాక్షులు చెబుతున్నారు. ఢిల్లీ పోలీసులు కల్పబుల్‌హోమిసైడ్ అభియోగాల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఈ సంఘటనపై దర్యాప్తునకు ఆదేశాలు జారీ చేసింది. ఈ భవనం ఎన్నేళ్ళ కాలం నాటిది, యజమాని ఎవరు అన్న వివరాలు కనుగొని, ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని కార్పొరేషన్ స్థాయీ సంఘం చైర్మన్ సత్య శర్మ తెలిపారు.

# త్వరలో డిజిటల్ హెల్త్ రికార్డులు

మొదటిపేజీ తరువాయి

ఇండియాలోనే లేదని చెప్పుకొచ్చారు. లలిత ఆస్పత్రి 600 పడకల సామర్థ్యంతో 900 మంది సిబ్బందితో ప్రారంభమైందని సీఎం చంద్రబాబు తెలిపారు. 32 విభాగాలకు వైద్యసేవలు అందించే ఏకైక కేంద్రం ఇదని వివరించారు. ప్రజల్లో నమ్మకం, విశ్వసనీయత ఉంటేనే.. ఏ వ్యవస్థ అయినా మనుగడ సాధ్యమని పేర్కొన్నారు. పేదల ఆరోగ్యం కాపాడేందుకు అన్ని చర్యలు చేపట్టామని తెలిపారు. ఆరోగ్యం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మంచి అలవాట్లతోనే ఆరోగ్యం కాపాడుకోవచ్చని చెప్పారు. యోగా, ధ్యానం చేస్తే అనారోగ్యం దరిచేరదని పేర్కొన్నారు. మనిషికి ఆరోగ్యాన్ని మించిన ఆస్తి లేదని సీఎం చంద్రబాబు తెలిపారు. సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్న వారే నిజమైన ధనవంతులని చెప్పుకొచ్చారు. ఆరోగ్యవంతులైన పౌరులు ఆరోగ్యకరమైన దేశాన్ని తయారు చేస్తారని అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ బాగా పని చేస్తున్నారని ప్రశంసించారు. సబ్జెక్టు అర్థం చేసుకుని వైద్య ఆరోగ్య శాఖను చక్కగా నిర్వహిస్తున్నారని చెప్పారు. సంజీవని పేరుతో డిజిటల్ హెల్త్ రికార్డు ప్రాజెక్టు తెస్తున్నామని తెలిపారు. ప్రపంచంలోని అత్యుత్తమ వైద్య పరిజ్ఞానం తెచ్చి ప్రజలకు ఇస్తామని అన్నారు. వ్యాధులు రాకుండా ఏం చేయాలో, వ్యాధి నిర్ధారణ నివారణకు సంబంధించి అత్యుత్తమ విధానాలు అమలు చేస్తామని తెలిపారు. యూనివర్సల్ హెల్త్ పాలసీ తెచ్చి రెండున్నర లక్షల వరకూ ఉచిత వైద్యం అందిస్తామని స్పష్టం చేశారు. పేదల ఆరోగ్యం కాపాడేందుకు ఏం చేయాలో అన్నీ చేస్తామని.. కానీ అనారోగ్యానికి గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రజలదేనని సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు. తినే తిండి, మంచి అలవాట్లు, మన పరిసరాలు, మనం ఆలోచించే విధానం ఆరోగ్యానికి చాలా ముఖ్యమని వివరించారు. యోగా, ధ్యానం, ప్రాణాయామం వంటి వాటికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మనం తినే ఆహారం మన ఆరోగ్యాన్ని కాపాడేలా ఉండాలని అన్నారు. గతంలో పంటలను రసాయన ఎరువులు, పురుగు మందులు వేయకుండా పండించామని ప్రస్తావించారు. జగన్ హయాంలో నాసిరకం మద్యం కారణంగా చాలామందికి ఆరోగ్య సమస్యలు వచ్చాయని అన్నారు. వైసీపీ హయాంలో దుర్మార్గమైన నిర్ణయంతో ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీశారని ధ్వజమెత్తారు. క్వాంటం, ఏఐ, డేటా సెంటర్, డిఫెన్స్ రీసెర్చ్ వంటి విభిన్న సాంకేతిక రంగాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని వ్యాఖ్యానించారు. ఇంట్లోనే ఉంటూ ఫోన్లు వాడితే ఎలా...? కుటుంబ సభ్యులు నేరుగా మాట్లాడుకోవాలని సూచించారు. పది నిమిషాలు వ్యాయామం చేయటానికి ఓపిక లేకపోతే ఎలా..? అందుకే అనారోగ్య సమస్యలు పెరిగిపోతున్నాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

ఈనెల 21వ తేదీన మరోసారి యోగా ద్వారా రికార్డులు సృష్టిద్దామని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. కృష్ణా నది బైపాస్ రహదారిపై యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా సంప్రదాయ వైద్య విధానాలు ప్రమోట్ చేస్తున్నారని తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమానికి గిన్నిస్ రికార్డులు వచ్చాయని ప్రస్తావించారు. మెడిటేషన్ యోగా కేంద్రాలు ఆస్పత్రిలో ఏర్పాటు చేయాలని సూచించారు. రైతన్నలు ప్రకృతి వ్యవసాయం చేయాలని సీఎం ఆకాంక్షించారు.

ప్రస్తుతం 20 లక్షల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని సీఎం చంద్రబాబు వివరించారు. రాబోయే రోజుల్లో 50 లక్షల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తామని అన్నారు. 'ఆస్పత్రులు ఆలయాలని.. వైద్యులు దేవుళ్లు. వైద్యో నారాయణో హరి అనేది మన సంస్కృతిలో ఉంది. ఏపీని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మార్చాలని తన కోరిక. హెల్తీ, వెల్దీ, హ్యాపీ సమాజమే మా లక్ష్యం' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# టెక్నాలజీ తదితర రంగాల్లో పరస్పర సహకారం

మొదటిపేజీ తరువాయి

చోటుచేసుకుంటున్నాయని... ముఖ్యంగా ఏఐ ప్రభావంతో సంప్రదాయ ఉద్యోగాల స్థానంలో కొత్త అవకాశాలు వస్తున్నాయని అన్నారు. జర్మనీ, జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాలకు అవసరమైన నైపుణ్యాలతో తెలంగాణ యువతను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసం యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు(ఏటీసీలు), పాలిటెక్నిక్ కళాశాలల్లో బోధన విధానాలను మార్చేందుకు తురింగియా సహకారం కావాలని కోరారు. సీఎం రేవంత్వ్యాఖ్యలకు స్పందించిన... తురింగియా సీఎం మారియో వోయిట్... తెలంగాణ అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు రూపొందించేందుకు తమ పరిశ్రమలు, విద్యాసంస్థలు సంసిద్ధంగా ఉన్నాయని తెలిపారు. జర్మనీలో పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు ఏమిటో గుర్తించి, వాటికి అనుగుణంగా తెలంగాణ యువతకు శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందని చెప్పారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ (టామ్‌కామ్) ద్వారా ఇప్పటికే జర్మన్ భాషా శిక్షణ కార్యక్రమాలు విజయవంతంగా సాగుతున్నాయని తెలిపారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లలో యువతకు అత్యాధునిక నైపుణ్యాలు అందిస్తున్నామని, తురింగియా ప్రతినిధులు ఈ కార్యక్రమాలను ప్రత్యేకంగా వెళ్లి పరిశీలించవచ్చని సూచించారు. పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి రంగాల్లో తెలంగాణకు కొత్త అవకాశాలు అందజేయనున్న ఈ ఒప్పందం రాష్ట్ర యువతకు అంతర్జాతీయ స్థాయి అవకాశాలను అందించే దిశగా కీలక అడుగుగా మారనుందని... సీఎం రేవంత్ నాయకత్వంలో తెలంగాణ ప్రపంచ పెట్టుబడిదారుల దృష్టిని ఆకర్షిస్తుండగా, జర్మనీ వంటి అభివృద్ధి చెందిన దేశాల రాష్ట్రాలు తెలంగాణతో భాగస్వామ్యం కోసం ముందుకు రావడం రాష్ట్ర ప్రతిష్టను మరింత పెంచిందనే అభిప్రాయం వ్యక్తమవుతోందని అన్నారు. తురింగియా సీఎం మాట్లాడుతూ సెమీకండక్టర్ రంగానికి చెందిన జర్మన్ కంపెనీల ప్రత్యేక బృందాన్ని తెలంగాణకు పంపేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఇక్కడి అవకాశాలను పరిశీలించి పెట్టుబడులపై చర్చలు జరుపుతామన్నారు. అయితే, ఈ ప్రతిపాదనను మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు స్వాగతిస్తూ ఇప్పటికే హైదరాబాద్‌లో అనేక అంతర్జాతీయ సెమీ కండక్టర్ కంపెనీలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నా యని చెప్పారు. త్వరలోనే తయారీ రంగంలో కూడా తెలంగాణ ముందంజలో నిలుస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రగతిశీల పనులను జర్మనీ ప్రతినిధులు ప్రశంసించారు. ఈ సమావేశంలో తురింగియా సీఎం మారియో వోయిట్ తెలంగాణను భారతదేశంలో అభివృద్ధి, ఆవిష్కరణలకు కేంద్రబిందువుగా అభివర్ణించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన 'తెలంగాణ రైజింగ్ - 2047' విజన్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. తెలంగాణ సాధించిన అభివృద్ధి ప్రత్యేకమైనదిగా వ్యాఖ్యానించారు. భారత-జర్మనీ సంబంధాల్లో తెలంగాణకు ప్రత్యేక స్థానం ఉందని... ఇంతటి వృద్ధి సాధించిన రాష్ట్రంతో భాగస్వామ్యం కావడం తమకు గౌరవంగా ఉందని వివరించారు. రెండు ప్రాంతాలకు ప్రయోజనం చేకూరేలా కలిసి పనిచేయాలని ఆకాంక్షిస్తున్నానని అన్నారు.

# ఆన్‌లైన్ బెట్టింగ్ కు రాజ్యాంగ రక్షణ లేదు

## సుప్రీకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ

**న్యూఢిల్లీ,జూన్ 03 ఆంధ్ర ప్రగతి** ఆన్‌లైన్ బెట్టింగ్ అనేది నైపుణ్యానికి సంబంధించిన ఆట అయినప్పటికీ దానికి రాజ్యాంగ రక్షణ ఉండబోదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. వివిధ క్రీడలపై ఆన్‌లైన్ బెట్టింగ్‌లను నిషేధిస్తూ తమిళనాడు, కర్ణాటక చేసిన చట్టాల రాజ్యాంగబద్ధతను సమర్థించింది. ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ అంశాలపై చట్టాలు రూపొందించేందుకు రాష్ట్రాలకు పూర్తి అధికారం ఉందని జస్టిస్ పార్థీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్ లతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. సమాజ హితం, శాంతి భద్రతల దృష్ట్యా ఆన్‌లైన్ గేమింగ్ ఎ÷-లాట్‌ఫామ్‌లపై నిషేధం విధించడాన్ని సమర్థిస్తున్నట్లు తెలిపింది. ఈ తీర్పుతో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల నిషేధానికి మార్గం సుగమమైంది. ఆన్‌లైన్ రమ్మీ, పోకర్ వంటి యాప్‌లలో డబ్బులు పందెంగా పెట్టడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. అటువంటి ఆటలు ఆడడానికి నైపుణ్యం అవసరమైనా... వాటిపై డబ్బులు పందేలు కాస్తే అది 'జూదం' కిందకే వస్తుందని పేర్కొంది. ఆన్‌లైన్ వ్యసనాల వల్ల యువత అప్పుల పాలై, ఆత్మహత్యలు చేసుకుంటున్న సామాజిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని ఈ తీర్పు వెలువరిస్తున్నట్లు తెలిపింది.

# కర్నాటక సిఎంగా డికె శివకుమార్ ప్రమాణం

మొదటిపేజీ తరువాయి

అంతకుముందు వేదికపై నుంచి ప్రజలకు సాష్టాంగ నమస్కారం చేశారు. తన సీనియర్ అయిన సిద్ధరామయ్యను వేదికపైనే డీకే సత్కరించారు.జి. పరమేశ్వర ఉపముఖ్యమంత్రిగా, మరో 12 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. మాజీ సీఎం సిద్ధరామయ్య కుమారుడు యతీంద్ర, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తనయుడు ప్రియాంక్ ఖర్గేకు మంత్రివర్గంలో చోటుదక్కింది. డీకే శివకుమార్ క్యాబినెట్ మంత్రులు 13 మంది చేత గవర్నర్ గెహ్లాట్ తావర్‌చందర్ గెహ్లాట్ ప్రమాణస్వీకారం చేయించారు. వీరిలో కేజీ జార్జ్, జి.పరమేశ్వర, రామలింగా రెడ్డి, కృష్ణ బైరే గౌడ, యూటీ ఖాదెర్, ఎంబీ పాటిల్, సతీశ్ జార్కిహోళి, ప్రియాంక ఖర్గే, యతీంద్ర సిద్ధరామ్యయ, లక్ష్మీ హెబ్బాల్కర్ ఉన్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, ఆపద్ధర్మ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు వీడీ సతీశన్, ఎ.రేవంత్ రెడ్డి, సుఖ్వీందర్ సింగ్ సుఖు, డీకే శివకుమార్ భార్య ఉషా శివకుమార్, కుమార్తె, పలువురు ఆధ్యాత్మిక నేతలు, విద్యార్థి, పౌరకార్మిక, రైతు ప్రతినిధులు, దళిత నేతలు, కన్నడ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కులదూషణలు దారుణం

మొదటిపేజీ తరువాయి

ఈ కుల సంఘాలను అడ్డం పెట్టుకుని వ్యక్తిగతంగా బాగుపడుతున్నారనే అనుమానం ఉందన్నారు. ఏ కులం నాయకుడితో ఆ కులం వారినే తిట్టించే నీచ సంస్కృతి వల్ల యువత భావోద్వేగాలకు లోనవుతున్నారని ఆందోళన చెందారు. గత వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ పరిస్థితి మరీ దిగజారిందని, సమాజానికి అద్దం పట్టే జర్నలిస్టులను సైతం కులాల పేరుతో దూషించడం ప్రారంభించారని ధ్వజమెత్తారు. ఒక వ్యక్తి తప్పు చేస్తే, దానికి కులాలను ఆపాదిస్తూ సమాజంలో చిచ్చు పెడుతున్నారని దుయ్యబట్టారు. వైసీపీ ఎమ్మెల్సీ దళిత యువకుడిని హత్య చేసి, శవాన్ని ప్యాక్ చేసి డోర్ డెలివరీ చేసినా ఆ పార్టీ వెనుకేసుకొచ్చిందని ఆగ్రహం

వ్యక్తం చేశారు. డాక్టర్ సుధాకర్‌ను మానసికంగా హింసించి చంపేసినా ఆయా కుల సంఘాలు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయినా వైసీపీ తీరు మారలేదని, ఇలాంటి కుల రాజకీయాలకు చరమగీతం పాడాలని జనసేన గట్టిగా నిర్ణయించుకుందని స్పష్టం చేశారు. ఇటీవల కూటమి మంత్రులు, ఎమ్మెల్యేల సమావేశంలో దీనిపై చర్చించామని.. ఎవరు ఎలా మాట్లాడినా తామంతా కలిసికట్టుగా స్పందిస్తామని పవన్ తెలిపారు. ఇకపై రాజకీయాల్లో జరిగే కుల దూషణలను, అరాచకాలను తిప్పికొట్టేందుకు జనసేన పక్షాన 'సేన గళం' పేరుతో ఒక హైపవర్ కమిటీని ఏర్పాటు చేసినట్లు, ఇకపై ఎవరు దూషించినా 'సేన గళం' గట్టిగా స్పందిస్తుందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హెచ్చరించారు.

# డీఎస్సీ అభ్యర్థులకు జగన్ భరోసా

మొదటిపేజీ తరువాయి

హామీ ఇచ్చారు. డీఎస్సీ అక్రమాలపై ఇప్పటికే సీబీఐ విచారణకు డిమాండ్ చేశామని గుర్తుచేసిన ఆయన.. భవిష్యత్తులో తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ అక్రమాలపై రీ-ఎంక్వైరీ చేయించడంతో పాటు, కేసుల దర్యాప్తు కోసం ప్రత్యేక కమిషన్ కూడా వేయిస్తామని స్పష్టం చేశారు.

క్రీడా కోటా ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో పారదర్శకత పూర్తిగా లోపించిందని జగన్ తీవ్రంగా విమర్శించారు. ఎలాంటి పరీక్షలు లేకుండా కేవలం సర్టిఫికెట్ల ఆధారంగానే ఉద్యోగాలు ఇస్తామంటూ ప్రభుత్వం జీవో ఇచ్చిందని, చంద్రబాబు తనకు కావలసిన వారికి లబ్ధి చేకూర్చడానికే ఈ గేట్లు తెరిచారని ఆరోపించారు. అనుకున్న వారికి ఉద్యోగాల భర్తీ ప్రక్రియ పూర్తి కాగానే, మళ్లీ పాత జీవోను మార్చేసి కొత్త జీవోను తీసుకురావడంలో ఉన్న అంతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో పాలకుల స్వార్థం స్పష్టంగా కనిపిస్తోందని మండిపడ్డారు.ప్రస్తుత డీఎస్సీ నిర్వహణలో లీకేజీల దగ్గర నుంచి అనేక అవకతవకలు బయటపడుతున్నాయని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్షల్లో మొదటి ర్యాంకు సాధించిన అభ్యర్థులకు కూడా ఉద్యోగాలు రాలేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు రాలేదనే నెపంతో ఫస్ట్ ర్యాంకర్లను పక్కన పెట్టారని ప్రభుత్వం చెబుతుంటే.. మరి అదే అభ్యర్థులు న్యాయం కోసం కోర్టులను ఎందుకు ఆశ్రయిస్తున్నారని ప్రశ్నించారు. అభ్యర్థుల ఫిర్యాదులకు ప్రభుత్వం నుంచి సరైన సమాధానాలు కరవయ్యాయని, అధికారుల తీరులో తీవ్ర లెక్కలేనితనం కనిపిస్తోందని జగన్ దుయ్యబట్టారు.

# భారత్‌పై అమెరికా మళ్లీ టారిఫ్స్..

**జూన్ 03 ఆంధ్ర ప్రగతి** భారత వస్తువులపై అమెరికా మరోసారి అదనపు సుంకాలు విధించనుందంటూ వస్తున్న వార్తలపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ఈ విషయంపై అగ్రరాజ్యంతో నిరంతరం చర్చిస్తున్నామని, ఈ పన్నుల ప్రతిపాదన ఇంకా ఖరారు కాలేదని స్పష్టం చేసింది. కార్మికులతో వెట్టిచాకిరి చేయించి ఉత్పత్తులు తయారు చేయించారంటూ భారత్‌తో సహా 60 దేశాలపై సెక్షన్ 301 కింద అదనపు సుంకాలు విధించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ యంత్రాంగం ప్రతిపాదించిన విషయం తెలిసిందే.

దీనిపై కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ స్పందిస్తూ అమెరికాతో వాణిజ్య ఫ్రేమ్‌వర్క్ ఒప్పందాన్ని ఖరారు చేసేందుకు చర్చలు కొనసాగుతున్నాయని తెలిపింది. ఈ పన్నుల ప్రతిపాదన ఇంకా ప్రజాభిప్రాయ సేకరణ దశలోనే ఉందని పేర్కొంది. సంబంధిత వర్గాలు 2026 జూన్ 22లోపు తమ విజ్ఞప్తులను సమర్పించవచ్చుని, జులై 7 తర్వాతే అమెరికా తుది నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేసింది.

ఇప్పటికే సెక్షన్ 232 కింద ఉన్న కొన్ని ఉత్పత్తులకు ఈ కొత్త పన్నుల నుంచి మినహాయింపు లభించింది. అలాగే టెక్స్‌టైల్ రంగానికి అమెరికా ప్రత్యేక వెసులుబాటును ప్రతిపాదించింది. దీని ప్రకారం నిర్దేశిత పరిమాణంలోని దుస్తుల దిగుమతులపై తక్కువ పన్ను రేట్లు విధించే అవకాశం ఉంది. పరస్పర వాణిజ్య ఒప్పందాలు అంగీకరించే దేశాలకు ఈ పన్ను 10 శాతంగా ఉంటుంది. ప్రస్తుతానికి చర్చలు నడుస్తున్నందున ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భారత్ వెల్లడించింది.

# పెట్టుబడుల వేట

మొదటిపేజీ తరువాయి

ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరిస్తూ, పలు కీలక ప్రతిపాదనలను వారి ముందుంచారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ భారత్ దిగుమతి చేసుకునే పెట్రోకెమికల్స్, స్పెషాలిటీ కెమికల్స్‌ను ప్రాసెస్ చేసేందుకు వీలుగా, భారత తూర్పు తీరంలోని విశాఖ-కాకినాడ పీసీపీఐఆర్ పరిధిలో రస్ కెమ్ ఆధ్వర్యంలో ఒక అత్యాధునిక ప్రాసెసింగ్ ఎ÷-లాంట్ ఏర్పాటు చేయండని ఆహ్వానించారు. పోర్టు ఆధారిత కెమికల్ లాజిస్టిక్స్ హబ్‌ల నిర్మాణం, బల్క్ కెమికల్ స్టోరేజీ వసతులు, ప్రత్యేక వాటర్ ఫ్రంట్ బెర్త్‌ల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. అంతేకాకుండా, ఏపీలో

అందుబాటులో ఉన్న సాంకేతిక నైపుణ్యాన్ని వినియోగించుకుని ఒక కొలాబరేటివ్ పాలిమర్ అప్లికేషన్, మెటీరియల్ సైన్స్ పరిశోధన కేంద్రాన్ని స్థాపించాలని సూచించారు. రస్ కెమ్ టెక్నాలజీతో పునరుత్పాదక ఇంధన కారిడార్లను అనుసంధానిస్తూ, తక్కువ కర్బన ఉద్గారాలు వెలువరించే రసాయనాల తయారీ యూనిట్‌ను నెలకొల్పాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి లోకేష్ ప్రతిపాదనలపై రస్ కెమ్ గ్రూప్ డిప్యూటీ సీఈఓ ఇల్యా కోసిహ్ సానుకూలంగా స్పందించారు. భారత్‌లో ప్రత్యేక ఎస్‌పీవీల ద్వారా హోల్‌సేల్ కెమికల్ పంపిణీ మార్కెట్‌లోకి ప్రవేశిస్తున్నట్లు ఆయన తెలిపారు. స్థానిక సంస్థలతో కలిసి పనిచేసేందుకు ఆసక్తిగా ఉన్నామని, ఇప్పటికే ముంబై, కాన్పూర్‌లలోని పంపిణీ కేంద్రాల ద్వారా పరిశ్రమలకు అవసరమైన రసాయనాలను సరఫరా చేస్తున్నట్లు వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రాంతీయ సరఫరా కేంద్రం ద్వారా విశాఖపట్నం, కాకినాడలోని ఫార్మా, తయారీ పరిశ్రమలకు కీలక రసాయనాలను అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. భారత్‌లోని భారీ పెట్రోకెమికల్ ఎ÷-లాంట్లను ఉపయోగించుకుని తమ గ్లోబల్ ఖాతాదారులకు స్థిరమైన సరఫరా అందిస్తామని హామీ ఇచ్చారు. మంత్రి లోకేష్ చేసిన ప్రతిపాదనలు ఆశాజనకంగా ఉన్నాయని, వీటిపై తమ సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చించి త్వరలోనే తుది నిర్ణయం ప్రకటిస్తామని ఇల్యా కోసిహ్ తెలిపారు.అలాగే రష్యా ప్రభుత్వ నియంత్రిత ప్రముఖ రిటైల్ బ్యాంకింగ్ సంస్థ స్బేర్‌బ్యాంక్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆల్బర్ట్ యెఫిమోవ్‌తో నారా లోకేశ్ మాస్కోలో భేటీ అయ్యారు. వెస్టర్న్ ఎ÷-లాట్‌ఫామ్‌లకు సురక్షితమైన లోకలైజ్డ్ జనరేటివ్ ఏఐ ప్రత్యామ్నాయ వ్యవస్థను అందించిన తరహాలోనే భారతదేశంలో బ్యాంకింగ్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, రిటైల్ రంగాలకు స్బేర్ బ్యాంక్ గిగాచాట్ ఎల్ఎల్ఎంను విస్తరించాలని నారా లోకేశ్ కోరారు. జాతీయ యూన్గి÷డ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ నెట్‌వర్క్ భద్రతను పటిష్ఠం చేస్తూ, స్బేర్‌బ్యాంక్ అడ్వాన్స్‌డ్ వాయిస్ రికగ్నిషన్, బయోమెట్రిక్ యాంటీ-ఫ్రాడ్ నెట్‌వర్క్‌ను భారతదేశ బ్యాంకింగ్ మౌలిక సదుపాయాల్లో ఇంటిగ్రేట్ చేసేలా సాంకేతిక సహకారం అందించాలన్నారు. భారత్‌లో పెద్దఎత్తున మున్సిపల్ కార్యకలాపాలను ఆప్టిమైజ్ చేయడానికి కొనసాగుతున్న స్మార్ట్ సిటీ మిషన్‌లో భాగంగా స్బేర్‌బ్యాంక్ ప్రిడిక్టివ్ అనలిటిక్స్, స్మార్ట్ ట్రాన్సిట్ సర్వైలెన్స్, డిజిటల్ సేఫ్టీ సిస్టమ్‌లను విస్తరించాలన్నారు. ప్రపంచస్థాయి సాఫ్ట్‌వేర్, ఏఐ ఇంజినీర్లకు వేగంగా శిక్షణ ఇవ్వడానికి, స్బేర్ బ్యాంక్ గేమ్గి÷డ్, పీర్-టు-పీర్ 'స్కూల్ 21' కోడింగ్ అకాడమీలను భారతదేశంలోని ప్రధాన విద్యా కేంద్రాలలో ఏర్పాటు చేయాలని కోరారు. వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న విశాఖపట్నంలో ఫార్మా, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతిదారుల సౌలభ్యం కోసం దూరప్రాంతాలకు రూపాయి-రూబుల్ వాణిజ్య అనుమతులు, వ్యవస్థీకృత రుణాలు అందించాలని లోకేశ్ విజ్ఞప్తి చేశారు. తమ బ్యాంక్ భారత్‌లోని న్యూదిల్లీ కార్యాలయం ద్వారా ద్వైపాక్షిక కమర్షియల్ ఫైనాన్స్, కార్పొరేట్ బ్యాంకింగ్ కార్యకలాపాలు, భారత్-రష్యా క్లయింట్ డెలివరీ సేవలను అందిస్తున్నట్లు స్బేర్‌బ్యాంక్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆల్బర్ట్ యెఫిమోవ్ చెప్పారు. మంత్రి నారా లోకేశ్ చేసిన ప్రతిపాదనలను పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

## ప్రజలకు సకాలంలో, నాణ్యమైన సేవలు అందించాలి
### -జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 03:**
ప్రజలకు ప్రభుత్వ సేవలు పారదర్శకంగా, వేగవంతంగా అందేలా సచివాలయ సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. బుధవారం నందికొట్కూరు మండలంలోని బ్రాహ్మణకొట్కూరు గ్రామ సచివాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా సచివాలయంలో నిర్వహిస్తున్న వివిధ సేవలు, ప్రజలకు అందుతున్న సంక్షేమ కార్యక్రమాల అమలు తీరు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యంగా గ్రామ ప్రజల అభిప్రాయాలు (పర్సెప్షన్), రీ–సర్వే ప్రక్రియ పురోగతి, పట్టాదార్ పాస్‌బుక్‌ల పంపిణీ స్థితి వంటి అంశాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.అనంతరం సచివాలయ సిబ్బంది హాజరు వివరాలతో పాటు సంబంధిత శాఖల రికార్డులను కలెక్టర్ పరిశీలించారు. ప్రజలకు అందించే సేవల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించి సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. సచివాలయానికి వచ్చే ప్రతి ఒక్కరిని మర్యాదపూర్వకంగా ఆహ్వానించి వారి సమస్యలను ఓర్పుతో వినాలని సూచించారు. ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ, వారి అవసరాలను గుర్తించి సేవలను సమర్థవంతంగా అందించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు సంబంధించిన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి, నాణ్యతతో సేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.ప్రభుత్వం ప్రజలకు చేరువగా ఉండాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయ వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరిగేలా సిబ్బంది కృషి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

## ముచ్చుమరి-ఓర్వకల్ నీటి పైప్‌లైన్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలి.

..క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.






**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 03:** ముచ్చుమర్రి నుంచి ఓర్వకల్ వరకు ఏపీఐఐసీ ఆధ్వర్యంలో చేపడుతున్న నీటి పైప్‌లైన్ ప్రాజెక్టు పనులను నిర్దేశిత గడువులోగా, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం నందికొట్కూరు మండల పరిధిలో ముచ్చుమరి నుంచి ఓరవకల్ వరకు కొనసాగుతున్న నీటి పైప్‌లైన్ పనులను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు. ప్రాజెక్టు పనుల పురోగతి, పైప్‌లైన్ ఏర్పాటు, నిర్మాణ నాణ్యత, సాంకేతిక అంశాలు, ఎదురవుతున్న సమస్యలు తదితర వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా పనుల అమలులో ఎటువంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా ప్రతి దశను పర్యవేక్షిస్తూ ముందుకు సాగాలని అధికారులకు సూచించారు. ప్రజలకు తాగునీటి సరఫరా మరియు పారిశ్రామిక అవసరాల దృష్ట్యా ఈ ప్రాజెక్టుకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని పేర్కొంటూ, పనులను ప్రణాళికాబద్ధంగా నిర్వహించి నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని ఆదేశించారు.అనంతరం నందికొట్కూరులో సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు పురోగతిపై శాఖల వారీగా సమీక్షించి, పెండింగ్‌లో ఉన్న పనులను గుర్తించి వాటి పూర్తి కోసం కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. పనుల అమలులో ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించి, ఎలాంటి జాప్యానికి అవకాశం లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పైప్‌లైన్ నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించడంతో పాటు భద్రతా నిబంధనలను కూడా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రాజెక్టు పూర్తయితే సంబంధిత ప్రాంతాలకు నీటి సరఫరా మరింత మెరుగుపడటంతో పాటు పారిశ్రామికాభివృద్ధికి కూడా దోహదపడుతుందని తెలిపారు. ముఖ్యంగా ఈ పైప్‌లైన్ ప్రాజెక్టు పనులను వీలైనంత త్వరగా, త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మధుసూదన్ రెడ్డి, ఆత్మకూర్ ఆర్డీఓ వెంకట శివ, నందికొట్కూరు తహశీల్దార్ శ్రీనివాసులు తదితరులు కలెక్టర్ వెంట ఉండి పాల్గొన్నారు.

## ఐటీసీ సిగరెట్ గోదాం చోరీ కేసు ఛేదన.
### అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్..


రూ.14 లక్షల నగదు, కారు స్వాధీన -డోన్ టౌన్, సీసీఎస్ పోలీసుల సంయుక్త ఆపరేషన్.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 03:**
నంద్యాల జిల్లా డోన్ పట్టణంలోని ఐటీసీ సిగరెట్ గోదాంలో జరిగిన భారీ చోరీ కేసును పోలీసులు ఛేదించి, అంతర్రాష్ట్ర దొంగల ముఠాకు చెందిన ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 14,01,500 నగదు, చోరీకి వినియోగించిన మారుతి సుజుకి స్విఫ్ట్ కారు, 45 లీటర్ల నాటు సారాయిని స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ సునీల్ శోరాన్ వెల్లడించారు.
పోలీసుల కథనం మేరకు, ఈ ఏడాది ఏప్రిల్ 20వ తేదీ వేకువజామున డోన్ పట్టణంలోని ఐటీసీ సిగరెట్ గోదాంలో చోరీ జరిగింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన డోన్ టౌన్ పోలీసులు, సీసీఎస్ నంద్యాల పోలీసులతో కలిసి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాలు, డోన్ డీఎస్పీ పర్యవేక్షణలో చేపట్టిన గాలింపు చర్యల్లో భాగంగా బుధవారం ఉదయం డోన్–గుత్తి రహదారిలోని రుద్రాక్ష గుట్ట సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించారు.విచారణలో వారు రాజస్థాన్‌కు చెందిన అంతర్రాష్ట్ర దొంగల ముఠా సభ్యులని, తమ మరో సహచరుడితో కలిసి ఐటీసీ గోదాంలో చోరీకి పాల్పడినట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. చోరీ చేసిన సిగరెట్ కార్టన్లను హైదరాబాద్‌లో విక్రయించి వచ్చిన నగదును తమ వద్ద ఉంచుకున్నట్లు వెల్లడించారు. అలాగే కడపలో కూడా ఇదే తరహా పలు చోరీలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారని పేర్కొన్నారు. మరో నిందితుడు ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు సమాచారం.







**అరెస్టైన నిందితులు**
లక్ష్మణ్ రామ్ కుమావత్ (45), పాళీ జిల్లా, రాజస్థాన్
గన్ శ్యాం అలియాస్ గన్ పత్ (45), పాళీ జిల్లా, రాజస్థాన్
మానక్ చంద్ కుమావత్ (35), పాళీ జిల్లా, రాజస్థాన్
పోలీసుల వివరాల ప్రకారం, ఈ ముగ్గురు నిందితులపై తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో ఇప్పటికే అనేక చోరీ కేసులు నమోదై ఉన్నాయి.

**స్వాధీనం చేసుకున్న వస్తువులు**
రూ. 14,01,500 నగదు
మారుతి సుజుకి స్విఫ్ట్ కారు (DL1CQ9769)
45 లీటర్ల నాటు సారాయి.
ఈ కేసు ఛేదనలో విశేష కృషి చేసిన డోన్ టౌన్ పోలీస్ స్టేషన్, సీసీఎస్ నంద్యాల పోలీసు సిబ్బందిని జిల్లా పోలీసు అధికారులు అభినందించారు. దర్యాప్తులో కీలక పాత్ర పోషించిన ఇన్‌స్పెక్టర్లు జి. ఇంతియాజ్ బాష, పి. సురేష్ కుమార్‌తో పాటు ప్రత్యేక బృంద సభ్యులను ఎస్పీ అభినందించినట్లు తెలిపారు.

## నెట్ జీరో హెల్త్ క్యాంపస్ లను జూన్ 5న నిర్వహించాలి.

..ముందుగా 13 విద్యా సంస్థలలో నిర్వహణ.
..ప్రకృతి పర్యవేక్షకులుగా విద్యార్థులను తీర్చిదిద్దాలి.
..జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి.

**ఆంధ్ర ప్రగతి కర్నూలు ,జూన్ 03 :**
రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన సాంకేతిక ప్రామాణికాలతో రూపొందించిన నెట్ జీరో హెల్త్ క్యాంపస్ కార్యక్రమాన్ని జూన్ 5న వివిధ రకాల మొక్కలు నాటి నిర్వహించాలి అని జిల్లా కలెక్టర్ ఏ సిరి జిల్లా అధికారులను ఆదేశించారు.
బుధవారం ఉదయం విజయవాడ నుండి రాష్ట్ర ప్రభుత్వ సెక్రటరీలు నివాస్ , మల్లికార్జున , రోనాల్డ్ , విజయకుమార్ , ముఖ్యమంత్రి కార్యాలయ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న , పంచాయతీరాజ్ శాఖ సెక్రెటరీ కృష్ణ తేజ లు అన్ని జిల్లా కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి ప్రపంచ పర్యావరణ దినోత్సవం జూన్ 5న నిర్వహించ తలపెట్టిన నెట్ జీరో హెల్త్ క్యాంపస్ ల నిర్వహణ కు పలు సూచనలు జారీ చేసి పాటించవలసిందిగా ఆదేశించారు. అనంతరం కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ సిరి జిల్లా అధికారులతో టెలి కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రకృతి ఒడిలో విద్యార్థులు సేద తీరేలాగా, పర్యావరణం పై విద్యార్థులకు పూర్తి అవగాహన కల్పించి అందులో వారు బాధ్యత తీసుకునే లాగా చైతన్యపరచాలని అధికారులను ఆదేశించారు.జిల్లాలోని గురుకుల విద్యాసంస్థలు ,



సంక్షేమ వసతి గృహాలలో మరియు విద్యా సంస్థలను పర్యావరణమునకు హిత కేంద్రాలుగా మార్చడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన విధంగా సాంకేతిక ప్రామాణికాలతో నెట్ జీరో హెల్త్ క్యాంపస్ కార్యక్రమాన్ని జూన్ 5న మొక్కలు నాటి నిర్వహించాలి అని తెలిపారు.
నెట్ జీరో ఎనర్జీ లక్ష్యంతో నెడ్‌క్యాప్ ద్వారా సోలార్ ప్యానెల్‌ల ఏర్పాటు ద్వారా సొంతంగా విద్యుత్ తయారు చేసుకునే చర్యలు , పునరుత్పాదక శక్తి వినియోగాన్ని పెంచాలని సూచించారు. సూర్య గమనం పై ఆధారపడి మియావాకి విధానంలో హైడెన్సిటీ మరియు అల్ట్రా హైడెన్సిటీ ప్లాంటేషన్‌లను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సుమారు 1625 మొక్కలను డి డబ్ల్యు ఎం ఏ గుర్తించిన 13 విద్యా సంస్థలలో అన్ని రకాల మొక్కల తో జూన్ 5న నాటే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అందుకు అవసరమైన అన్ని చర్యలు చేయాలని ఆదేశించారు. ఈ ప్రస్తుత చర్యల అనంతరం మిగిలిన ట్రైబల్ వెల్ఫేర్, ఎస్సీ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, మైనారిటీ వెల్ఫేర్ తదితర శాఖలకు చెందిన విద్యాసంస్థల్లో విస్తరింప చేసే పనులు చేపట్టాలని, ప్లాంటేషన్ కార్యక్రమాలు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.
నెట్ జీరో కార్యక్రమాల్లో భాగంగా బయో వేస్ట్, లిక్విడ్ వేస్ట్ ,గ్రీన్ వాటర్ నిర్వహణలో భాగంగా సోక్ పిట్లు, రైన్ వాటర్ హార్వెస్టింగ్ పిట్లు,గ్రే వాటర్ పిట్ లు , కిచెన్ వేస్ట్ పిట్ లను సాంకేతికంగా నిర్దేశించిన మేరకు ఏర్పాటు చేయాలని తెలిపారు.
ప్రహరీలు లేని విద్యాసంస్థలకు హార్టికల్చర్ విభాగం ద్వారా బ్యాంబు ఫెన్సింగ్ ఏర్పాటు నిమిత్తం తగు చర్యలు తీసుకోవాలని హార్టికల్చర్ ఏడి రాజకృష్ణ రెడ్డి ని ఆదేశించారు.
విద్యా సంస్థల కిచెన్ గార్డెన్ తయారు చేసుకొనుట కు కావలసిన ఆకుకూరలు మరియు అన్ని రకాల కాయగూరల విత్తనాలను నేచర్ ఫార్మింగ్ డిపిఎం మాధురిని అందించవలసిందిగా ఆదేశించారు.
రూరల్ లో ఉన్న విద్యాసంస్థల వాటర్ హార్వెస్టింగ్ పిట్ల ఏర్పాటును డ్వామా పిడి , అర్బన్ ప్రాంతంలో ఉన్న విద్యా సంస్థల వాటర్ హార్వెస్టింగ్ పిట్ ల ఏర్పాటును స్థానిక మున్సిపల్ కమిషనర్లు ఏర్పాటు చేయవలసిందిగా ఆదేశించారు. ఈ టెలి కాన్ఫరెన్స్ సమావేశానికి డ్వామా పీడీ నరసింహారెడ్డి , కర్నూలు మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేష్ , సోషల్ వెల్ఫేర్ అధికారి రాధిక ప్రత్యక్షంగాను , ఏడి హార్టికల్చర్ రాజకృష్ణ రెడ్డి , డిపిఓ భాస్కర్ నెడ్ క్యాప్ డివో వీరేంద్ర మరియు వెల్ఫేర్ హాస్టల్ల అధికారులు ఫోన్ ద్వారా పాల్గొన్నారు.

## రవాణా శాఖ రెవెన్యూ కి సంబంధించిన లక్ష్యాలను సాధించే విధంగా చర్యలు.

..మార్కెట్‌లో వినియోగదారులు మోసపోకుండా తూకాలు, కొలతలపై నిరంతర నిఘా ఉంచాలి.
..ఆర్టీసీ బస్టాండ్ లు శుభ్రంగా ఉండే విధంగా చర్యలు చేపట్టండి. -జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.

**ఆంధ్ర ప్రగతి కర్నూలు, జూన్ 03:**
రవాణా శాఖ రెవెన్యూ కి సంబంధించిన లక్ష్యాలను సాధించే విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి డిటిసి ని ఆదేశించారు.
బుధవారం కలెక్టరేట్ లో వివిధ అంశాల పై ఆర్టీసీ, డిటిసి, లీగల్ మెట్రోలాజి, ఫుడ్ సేఫ్టీ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రవాణా శాఖ ఆదాయ వనరులు, లక్ష్యాల సాధనపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గత ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం నిర్దేశించిన రెవెన్యూ లక్ష్యాలను శాఖ సమర్థవంతంగా అమలు చేసి గణనీయమైన వసూళ్లు సాధించిందని, ఈ ఆర్థిక సంవత్సరంలో కూడా నిర్దేశించిన లక్ష్యాలను సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డిటిసి ని ఆదేశించారు. జిల్లాలో ఆర్టీసీ సేవలను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తూ ఆదాయాన్ని పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆర్టీసీ ఆర్ఎం ను ఆదేశించారు. అదే విధంగా ఆర్టీసీ బస్టాండ్ లు శుభ్రంగా




ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.
మార్కెట్‌లో వినియోగదారులు మోసపోకుండా తూకాలు, కొలతలపై నిరంతర నిఘా ఉంచాలని, అదే విధంగా నిత్యావసర వస్తువులు, పెట్రోల్ బంకులు, షాపింగ్ మాల్స్‌లో తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ లీగల్ మెట్రోలాజి వారిని ఆదేశించారు. ప్రజల ఆరోగ్యంతో ఆటలాడే కల్తీ వ్యాపారులపై ఉక్కుపాదం మోపాలని




కలెక్టర్ స్పష్టం చేశారు. హోటళ్లు, స్వీట్ షాపులు, పచ్చలు, వీధి వ్యాపార కేంద్రాలలో ఆహార నాణ్యతను నిరంతరం తనిఖీ చేయాలని, నిల్వ ఉంచిన రసాయనాలతో కూడిన ఆహార పదార్థాలను విక్రయిస్తే సీజ్ చేయాలని కలెక్టర్ ఫుడ్ సేఫ్టీ అధికారిని ఆదేశించారు. సమావేశంలో డిటిసి శాంతకుమారి, సిపిఓ భారతి, ఏపీఎస్ఆర్టీసీ ఆర్ఎం శ్రీనివాసులు, ఫుడ్ సేఫ్టీ అధికారి రాజగోపాల్, లీగల్ మెట్రాలజీ అధికారి తదితరులు పాల్గొన్నారు

## ప్రజల గుండెల్లోంచి శిల్పా కుటుంబాన్ని ఎవరూ చెరిపేయలేరు..!

.మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి.
అధికారం ఉంది కదా అని సేవా కార్యక్రమాలను అడ్డుకుంటారా.?
..మాకు మళ్లీ ఒక రోజు వస్తుంది..
ప్రజల దీవెనలు మాకున్నాయి.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 03:**
నంద్యాల ప్రజల గుండెల్లోంచి శిల్పా కుటుంబాన్ని ఎవరూ చెరిపేయలేరు..! అధికారం ఉంది కదా అని అడ్డుకుంటే.. సేవ ఆగిపోదు..! నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి భావోద్వేగ వ్యాఖ్యలు ఇప్పుడు స్థానికంగా సంచలనంగా మారాయి. "మాకు మళ్లీ ఒక రోజు వస్తుంది.. ప్రజల దీవెనలు మాకున్నాయి" అంటూ ఆయన ప్రత్యర్థులకు గట్టి కౌంటర్ ఇచ్చారు. రాజకీయాలు వస్తుంటాయి.. పోతుంటాయి. అధికారాలు మారుతుంటాయి. కానీ, పేదవాడి ఆకలి, పేదింటి మహిళ కష్టం ఎప్పుడూ ఒకేలా ఉంటాయి. నంద్యాల నడిబొడ్డున గత 16 ఏళ్లుగా నిరంతరంగా సాగుతున్న శిల్పా సేవాసమితి ప్రస్థానంలో ఇప్పుడు రాజకీయ అడ్డంకులు కలకలం రేపుతున్నాయి. శిల్పా మహిళా సహకార బ్యాంక్ ద్వారా అర్హులైన 141 మంది పేద మహిళలకు.. దాదాపు 24 లక్షల 58 వేల రూపాయల రుణాల చెక్కులను మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ




సందర్భంగా ఆయన మాట్లాడిన మాటలు నంద్యాల ప్రజల మనసులను తాకుతున్నాయి.
మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ "నంద్యాల ప్రజల మనసుల్లోంచి శిల్పా కుటుంబాన్ని ఎవ్వరూ చెరిపేయలేరు. మాకు మళ్లీ ఒక రోజు వస్తుంది. అధికారం ఉంది కదా అని మేము చేస్తున్న సేవా కార్యక్రమాలకు అడ్డంకులు సృష్టిస్తున్నారు. భగవంతుని ఆశీస్సులు, ప్రజల దీవెనలతో మేము ముందుకు వెళ్తాం అన్నారు. కక్ష సాధింపు చర్యలా? లేక కావాలనే అడ్డుకుంటున్నారా? టెక్కె మార్కెట్ యార్డు షాపింగ్ కాంప్లెక్స్‌లో గత 16 ఏళ్లుగా శిల్పా సహకార్, శిల్పా మహిళా సహకార్ బ్యాంక్, నంది రైతు పెస్టిసైడ్స్ నడుస్తూ.. పేదలకు, రైతులకు అండగా నిలుస్తున్నాయి. 1987లో కట్టిన ఆ బిల్డింగులు, దాదాపు 23 ఏళ్ల పాటు శిథిలావస్థలో ఉంటే.. వాటిని సొంత ఖర్చులతో




మరమ్మతులు చేయించి, క్రమం తప్పకుండా అద్దెలు కడుతూ సేవ చేస్తుంటే.. ఇప్పుడు వాటిని ఖాళీ చేయించేందుకు, ఈనెల 9న బహిరంగ వేలం వేసేందుకు నోటీసులు ఇవ్వడంపై శిల్పా రవిరెడ్డి తీవ్ర ఆగ్రహం, ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా, ఎన్ని నోటీసులు ఇచ్చినా.. పేదలకు చేసే సేవలను ఆపే ప్రసక్తే లేదని శిల్పా రవిరెడ్డి స్పష్టం చేశారు. రుణాలు అందుకున్న మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునే వరకు తమ వంతు సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ డైరెక్టర్ పూర్ణిమ, మేనేజర్లు హరిలీల, లక్ష్మీనారాయణ ,మహిళలు పాల్గొన్నారు. అధికార బలం ముందు.. పేదల ఆశీస్సుల బలం గెలుస్తుందా? శిల్పా కుటుంబం నంద్యాల ప్రజల గుండెల్లో సంపాదించుకున్న స్థానాన్ని ప్రత్యర్థులు చెరపగలరా? కాలమే సమాధానం చెప్పాలి.

## మున్సిపల్ సేవలు ప్రైవేటీకరిస్తే ప్రజా ఆందోళన లు తప్పదు.

..మునిసిపల్ ప్రైవేటీకరణ జిఓలు 975, 673 రద్దు చేయాలి.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 03:**
మున్సిపల్ సేవలను ప్రైవేటీకరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జిఓలు 673, 975ను తక్షణం ఉపసంహరించుకోవాలని సిపిఎం పట్టణ కార్యదర్శి దర్శనం. లక్ష్మణ్,పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు పుల్లా. నరసింహ, కి. మహమ్మద్ గౌస్, పి. వెంకట లింగం, పట్టణ కమిటీ సభ్యులు మాబుజైలాన్ లు కలిసి ప్రెస్ నోట్ విడుదల చేశారు..అనంతరం వారు మాట్లాడుతూ ఈ 673,975 జిఓ ల ద్వారా 14 సేవలను ప్రైవేటుపరం చేస్తున్నారని, వాహనాలు, డ్రైనేజీ, మంచినీరు, ఆఫీస్ నిర్వహణ సహా పిపిపి పద్ధతిలో ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.మున్సిపాల్టీ ఎన్నికలు జరగలేదని, ప్రస్తుతం పాలకవర్గాలు లేవని, అధికారుల పర్యవేక్షణలోనే పాలన సాగుతోందని




గుర్తుచేశారు. పిపిపి అమలైతే భవిష్యత్తులో ఎన్నికలు జరిగి ఛైర్పర్సన్లు వచ్చినా ఏమి చేయలేరని చెప్పారు.పౌర సేవలు అందించడానికే ఉన్న పంచాయతీలు,మున్సిపాలిటీలకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఫైనాన్స్ కమిషన్ ద్వారా 40 శాతం నిధులు విడుదల చేస్తే ఏ సేవనూ ప్రైవేటీకరించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.మునిసిపల్ సేవలను ప్రైవేటీకరించి యూజర్ ఛార్జీల పేరుతో ప్రజలపై భారాలు వేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో వైసిపి ప్రభుత్వం వేసిన చెత్త పన్ను ప్రజలకు భారంగా మారిందని, ఇది రాజకీయ అంశంగా మారడంతో అధికారంలోకి రాగానే కూటమి ప్రభుత్వం రద్దు చేసిందని గుర్తు చేశారు.ఇప్పుడు 14 సేవలను ప్రైవేటుపరం చేసి యూజర్ ఛార్జీలు వేస్తే పట్టణ ప్రజలపై వేల కోట్ల భారం పడుతుందని, ప్రజలు ఎలా భరిస్తారని ప్రశ్నించారు.ప్రైవేటీకరణ వల్ల మున్సిపాలిటీలో పనిచేసే కార్మికులు, ఉద్యోగులకు ఉద్యోగ భద్రత ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లు, ప్రైవేట్ కంపెనీలు యంత్రాలతో కొద్దిమందితో పనిచేయించుకుంటారని, దీంతో ఉద్యోగాలు ఊడిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. జిఓలు 975,673 ఉపసంహరించుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ యూనియన్లు, ప్రజలు, పౌర సంఘాలను కలుపుకొని ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# నవచేతన యాప్ ద్వారా ఏఐ-ఆధారిత ఈ సి డి స్క్రీనింగ్.

**..0-6 సంవత్సరాల వయస్సు గల చిన్నారులలో ఆరోగ్య, అభివృద్ధి లోపాల గుర్తింపు.**

**..జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.**

**ఆంధ్ర ప్రగతి కర్నూలు, జూన్ 03:** నవచేతన యాప్ ద్వారా ఏఐ-ఆధారిత ఈ సి డి స్క్రీనింగ్ చేయడం జరుగుతుందని తద్వారా చిన్నారులలో ఆరోగ్య, అభివృద్ధి లోపాలను గుర్తించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి తెలిపారు.
బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో మహిళా శిశు సంక్షేమ శాఖ అధ్వర్యంలో 0-6 సంవత్సరాల వయస్సు గల పిల్లల కోసం నవచేతన యాప్ ద్వారా ఏఐ-ఆధారిత ఈ సి డి స్క్రీనింగ్‌పై సిడిపిఓ, అంగన్వాడీ సూపర్వైజర్ లకు జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. చిన్నారుల్లో అభివృద్ధి సంబంధిత సమస్యలు, వైకల్యాలను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన వైద్య సేవలు అందించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం "నవచేతన" యాప్‌ను వినియోగిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. జూన్ 5 నుండి 10 వరకు మండల స్థాయిలో అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి, అనంతరం జిల్లా వ్యాప్తంగా నవచేతన యాప్ ద్వారా ఏఐ ఆధారిత స్క్రీనింగ్ కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. చిన్నారుల ఆరోగ్యవంతమైన భవిష్యత్తు కోసం నవచేతన యాప్ ఒక సమర్థవంతమైన సాధనంగా ఉపయోగపడుతోందని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో చిన్నారుల అభివృద్ధి లోపాలను గుర్తించేందుకు చేపడుతున్న స్క్రీనింగ్ ప్రక్రియను అత్యంత బాధ్యతాయుతంగా, ఖచ్చితత్వంతో నిర్వహించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సీడీపీఓలు, సూపర్‌వైజర్లు యాప్‌లోని అన్ని అంశాలను పూర్తిగా అవగాహన చేసుకుని, తమ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రత్యక్షంగా శిక్షణ ఇవ్వాలన్నారు. పిల్లల అభివృద్ధి స్క్రీనింగ్ కార్యక్రమం అత్యంత కీలకమైందని, ఇందులో సేకరించే సమాచారం భవిష్యత్తులో చిన్నారుల ఆరోగ్య, అభివృద్ధి కార్యక్రమాలకు మార్గదర్శకంగా ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. అందువల్ల ప్రతి వివరాన్ని నిజాయితీగా నమోదు చేయాలని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పనిచేయాలని సూచించారు.
06 సంవత్సరాల పిల్లల్లో బర్త్ డిఫెక్ట్స్, వ్యాధులు, పోషకాహార లోపాలు, అభివృద్ధి ఆలస్యాలు (4 డి.ఎస్) సులభంగా గుర్తించేందుకు అంగన్‌వాడీ సిబ్బందికి "అవును/కాదు" విధానంలో సరళమైన చెక్‌లిస్ట్ రూపొందించాలని కలెక్టర్ వైద్య నిపుణులను






సూచించారు. గ్రాస్ మోటార్, ఫైన్ మోటార్, భాషా, జ్ఞానాత్మక (కాగ్నిటివ్), సామాజిక-భావోద్వేగ (సోషియో-ఎమోషనల్) అభివృద్ధి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి పిల్లల వయస్సుకు తగిన నైపుణ్యాలను అంచనా వేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. అభివృద్ధి లోపాలను తొలిదశలోనే గుర్తించడం ద్వారా తగిన వైద్య, పునరావాస సేవలు అందించవచ్చని, వినికిడి లోపాలు వంటి సమస్యలను కూడా ముందుగానే గుర్తించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని కలెక్టర్ తెలిపారు. పిల్లల్లో ఆటిజం కేసులు పెరుగుతున్న నేపథ్యంలో లక్షణాలను ప్రారంభ దశలోనే గుర్తించడం అత్యంత అవసరమని కలెక్టర్ తెలిపారు. ఆటిజంపై గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. పిల్లల అభివృద్ధి సూచికలను క్రమం తప్పకుండా పరిశీలించడం ద్వారా అభివృద్ధి లోపాలను ముందుగానే గుర్తించి తగిన సేవలు అందించవచ్చన్నారు.
పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు సమతుల్య ఆహారం ఎంతో ముఖ్యమని కలెక్టర్ తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహార కిట్లు, గుడ్లు, పాలు వంటి ఆహారాన్ని పిల్లలకు సక్రమంగా అందించి పోషకాహార లోపాలను తగ్గించాలని కలెక్టర్ సూచించారు. అలాగే మేనరిక వివాహాల వల్ల జన్యుపరమైన సమస్యలు వచ్చే అవకాశాలు పెరుగుతాయని, వాటి దుష్పరిణామాలపై గ్రామీణ స్థాయిలో అవగాహన కల్పించాలని కలెక్టర్ కోరారు.. పిల్లల అభివృద్ధి లోపాల గుర్తింపుతో పాటు పోషకాహారం, తల్లి-శిశు ఆరోగ్యం, మేనరిక వివాహాల నివారణపై అవగాహన కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ, ఆశా మరియు ఆరోగ్య సిబ్బంది ప్రజల్లో చైతన్యం పెంచేందుకు మరింత చొరవ చూపాలని కలెక్టర్ సూచించారు.
సమావేశంలో ఐసిడిఎస్ పిడి విజయ , డా. సృజన రెడ్డి, జిల్లా ప్రారంభ జోక్య కేంద్రం (ఐజు×జ) మేనేజర్ ఇర్ఫాన్, మెడికల్ ఆఫీసర్లు, సీడీపీవోలు, సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి విపత్తులను ఎదుర్కొనేందుకు.. ముందస్తు కార్యాచరణతో సిద్ధంగా ఉండాలి.

**..ప్రకృతి వైపరీత్యాల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి. -జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి.**

**ఆంధ్ర ప్రగతి కర్నూలు, జూన్ 03:** ప్రకృతి వైపరీత్యాలు, అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ముందస్తు సన్నద్ధత, శాఖల మధ్య సమన్వయం, విపత్తు నిర్వహణ చర్యలపై సమగ్ర కార్యాచరణ రూపొందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు.
బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన క్రైసిస్ మేనేజ్మెంట్ సమావేశంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షత వహించి వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... శాస్త్రవేత్తల అంచనాల ప్రకారం ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా ఉండే అవకాశం ఉన్నందున రైతులు, ప్రజలు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి శాఖ తమ పరిధిలో ఎదురయ్యే సమస్యలను ముందుగానే గుర్తించి వాటి నివారణకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు తక్కువ నీటితో సాగు చేయగల పంటలపై అవగాహన కల్పించాలని, నీటి వినియోగాన్ని తగ్గించే సాగు విధానాలను ప్రోత్సహించాలని సూచించారు. ఉద్యానవన శాఖ ద్వారా మిల్లెట్స్, పండ్ల తోటల సాగును విస్తరించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. అలాగే డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ సాగునీటి పద్ధతుల అమలులో నిర్దేశిత లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించాలని ఆదేశించారు. పశుసంవర్ధక శాఖ అధికారులు పశువులకు అవసరమైన మేత నిల్వలను పెంపొందించడంతో పాటు పశుగ్రాస ఉత్పత్తిని ప్రోత్సహించాలని సూచించారు. నీటి కొరత పరిస్థితుల్లో పశుసంపదకు ఎటువంటి ఇబ్బందులు





కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ అధికారులు అంగన్‌వాడీ కేంద్రాల్లో తగినంత తాగునీటి సదుపాయం కల్పించాలని, గర్భిణీలు, బాలింతలకు హీట్‌వేవ్ ప్రభావాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వం అందించే పోషకాహార కిట్లు, సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన వారికి సకాలంలో అందేలా చూడాలని ఆదేశించారు. గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులు పైపులైన్లు, తాగునీటి పంపిణీ వ్యవస్థలలో ఉన్న లోపాలను వెంటనే గుర్తించి మరమ్మతులు చేపట్టాలని, వేసవి కాలంలో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ శాఖ అధికారులు రైతులకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడాలని, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్ల మరమ్మతులను వెంటనే పూర్తి చేసి వ్యవసాయ అవసరాలకు నిరంతర విద్యుత్ అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నీటిపారుదల శాఖ అధికారులు జిల్లాలోని 246 మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు మరియు ఇతర నీటి వనరుల సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. చెరువులు, కుంటలు, కాలువలలో అవసరమైన మరమ్మతులు చేపట్టి వర్షపు నీటిని గరిష్టంగా నిల్వ చేసుకునే విధంగా ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. పౌర సరఫరాల శాఖ అధికారులు రేషన్ కార్డు లబ్ధిదారులకు నిత్యావసర సరుకులు ఎటువంటి అంతరాయం లేకుండా సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజారోగ్య, రెవెన్యూ మరియు ఇతర శాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొనేందుకు సమిష్టిగా పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఎలాంటి విపత్తు పరిస్థితులు ఎదురైనా నష్టాలను తగ్గించే దిశగా అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండి ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, సిపివో భారతి, జిల్లా పరిషత్ సీఈవో వెంకట రమణ రెడ్డి, డ్వామ ఏపిడి మాధవి, పశువర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ (ఇన్చార్జి) వసంత లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

# అలగనూరు రిజర్వాయర్ మరమ్మతులకు 34 కోట్ల రూపాయలు కేటాయించాలి.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా జూన్ 03:** నంద్యాల జిల్లా అలగనూరు రిజర్వాయర్ కు ఏర్పడిన గండిని పూడ్చి మరమ్మతులు చేయడానికి 34 కోట్ల రూపాయలు మంజూరు చేసి నందికొట్కూరు పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు తాగునీరు అందించాలని విజ్ఞప్తి చేస్తూ సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ శాసన సభ్యులు



కె.రామకృష్ణ,రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.రామాంజనేయులు 04-06-2026న రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ను రాష్ట్ర సచివాలయం లో కలిసి విజ్ఞప్తి చేయడం జరిగింది. ఆనాటి ముఖ్యమంత్రి ఎన్ టి రామారావు ఎస్ఆర్బిసి కాలువ సాగునీటి స్థిరీకరణకై 3 టీఎంసీల సామర్థ్యంతో అలగనూరు రిజర్వాయర్ను శంకుస్థాపన చేయగా 2004లో వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రారంభించడం జరిగింది. 2017లో రిజర్వాయర్కు పడిన గండిని పూడ్చేందుకు 2019లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 3 కోట్ల రూపాయలు అంచనా వ్యయంతో సిద్ధమైనప్పటికీ తర్వాత ప్రభుత్వం మారడంతో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో నిర్లక్ష్యం చేయడం వల్ల అది నేటికీ 34 కోట్ల రూపాయలకు చేరింది. అనేక సంవత్సరాలుగా రిజర్వాయర్కు గండిపడడం వల్ల నీటిని నిలువ చేయలేని పరిస్థితి ఏర్పడిందని తిరిగి ఈ ప్రభుత్వంలోనైనా రిజర్వాయర్ గండిని పూడ్చడం వల్ల నందికొట్కూరు పట్టణానికి చుట్టుపక్కల ప్రాంతాలకు త్రాగునీటి సమస్య శాశ్వతం గా పరిష్కార మై రిజర్వాయర్ నిండటం వల్ల చుట్టుపక్కల శ్రీభూముల్లో భూగర్భ జలాలు పెరిగి బోర్ల ద్వారా రైతుల కు వ్యవసాయం కు ఉపయోగపడటం తో పాటు 150 మత్స్యకార కుటుంబాలకు ఉపాధి దొరుకుతుందని తక్షణమే మరమ్మతులు చేపట్టాలని వారు కోరారు రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు సా నుకూలంగా స్పందించి తప్పకుండా రిజర్వాయర్ గండిని పూడ్చి మరమ్మతులుచేపట్టెందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగింది . ఈ కార్యక్రమంలో సిపిఐ కర్నూలు జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్య,జిల్లా సహాయ కార్యదర్శి నక్కి లెనిన్ బాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు జి. రంగన్న తదితరులు పాల్గొన్నారు.

# క్రింది స్థాయి టీడీపీ నాయకులు తమ స్థాయి తెలుసుకొని మాట్లాడాలి.

**-లేని పక్షంలో తీవ్రపరిణామాలు ఎదుర్కొంటారు. -వైసీపీ**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 03:** నంద్యాలలో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు టీడీపీ స్థానిక నాయకులపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాష్ట్రంలోనే ఎంతో పేరుగాంచిన శిల్పా కుటుంబంపై కొందరు క్రింది స్థాయి టీడీపీ నాయకులు చేస్తున్న విమర్శలను వైసీపీ నేతలు తీవ్రంగా ఖండించారు.మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డిలపై కొందరు నేతలు తమ స్థాయి మరిచి, మీడియా సమావేశాలు పెట్టి దుర్భాషలాడటం, వ్యంగ్యంగా అసత్యపు ఆరోపణలు చేయడం సరికాదని వైసీపీ నేతలు హితవు పలికారు. నంద్యాల అభివృద్ధి గురించి మాట్లాడే ముందు వాస్తవాలు తెలుసుకోవాలని... స్థాయి మరిచి ప్రగల్భాలు పలికితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. భవిష్యత్తులో శిల్పా కుటుంబంపై ఇలాంటి పరుష పదజాలం ఉపయోగిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని వైసీపీ నేతలు మాజీ కౌన్సిలర్ ఆరిఫ్ నాయక్, అనీల్ అమృతరాజ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రత్నబాబు చౌదరి, టైలర్ శివయ్య, కారు రవికుమార్, చింత శ్రీనివాసులు, దండి సుధాకర్, శంకర్ నాయక్, ఎర్రన్న, గట్టిగా హెచ్చరించారు.

# ప్లాస్టిక్ వినియోగం తగ్గించి పర్యావరణ హిత జీవన విధానాలను అలవర్చుకోవాలి.

**..ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాలు. -పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం పెరగాలి.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 03:** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఈ నెల 5వ తేదీన నంద్యాల జిల్లాలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి మరియు అటవీ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో పలు ప్రత్యేక పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ జి రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు బుధవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో పర్యావరణ పరిరక్షణ గోడపత్రికను ఆవిష్కరించి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు, పర్యావరణ హిత జీవన విధానాలను ప్రోత్సహించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే, "వన్ మంత్ - ఫోర్ విజిట్" కార్యక్రమంలో భాగంగా ఆళ్లగడ్డ పట్టణంలో నిర్వహించనున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక లో స్థానిక ఎమ్మెల్యేతో పాటు ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ఫిర్యాదుదారులు పాల్గొననున్న నేపథ్యంలో, వారందరికీ జూట్ బ్యాగులు మరియు మొక్కలను పంపిణీ






చేసేలా తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.ప్లాస్టిక్ సంచులకు ప్రత్యామ్నాయంగా జూట్ బ్యాగుల వినియోగాన్ని ప్రోత్సహించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రజలను మరింతగా భాగస్వాములను చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని కలెక్టర్ వివరించారు. పర్యావరణ పరిరక్షణ అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాకుండా ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని అన్నారు. వాతావరణ మార్పులు, కాలుష్య సమస్యలు మరియు సహజ వనరుల క్షీణత వంటి సవాళ్లను ఎదుర్కోవడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి మరియు అటవీ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే జూన్ 20వ తేదీలోపు జిల్లాలో 8 లక్షల విత్తన బంతులు తయారు చేసి సిద్ధంగా ఉంచేలా సోషల్ ఫారెస్ట్రీ డివిజనల్ ఫారెస్ట్ అధికారిని కలెక్టర్ ఆదేశించారు.వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ విత్తన బంతులను అటవీ ప్రాంతాలు మరియు ఖాళీ భూముల్లో విస్తృతంగా చల్లడం ద్వారా హరిత విస్తీర్ణాన్ని పెంచే చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు మరియు సాధారణ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని పర్యావరణ పరిరక్షణకు తమ వంతు సహకారం అందించాలని కలెక్టర్ కోరారు.

EDITOR.PRINTED,PUBLISHED AND OWENED BY CHINNA MATHANGI SREENIVASULU AND PRINTED AT:JRD PUBLICATIONS, # 11-107, ABBAS NAGAR, DISTRICT- KURNOOL,ANDHRA PRADESH- 518002
AND PUBLUSHED FROM #24-100B, HARIJANAWADA, NANDYAL, ANDHRA PRADESH- 518501 RNI : APTEL/2023/89112, PHONE NO: 81211 33006, EMAIL ID : SREENIVAS.CM77@GMAIL.COM

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక

గురువారం 4 జూన్ 2026

## నార్వే పార్లమెంట్ సమావేశాలను ప్రత్యక్షంగా తిలకించిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి బృందం.



నార్వే పార్లమెంట్ భవనం ముందు ఎంపీ ల బృందం



నార్వే పార్లమెంట్ సమావేశాలను ప్రత్యక్షంగా వీక్షిస్తున్న నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి, విశాఖపట్నం ఎంపీ భరత్

**ఆంధ్ర ప్రగతి గంగా జిల్లా జూన్ 03:**
బుధవారం నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి, విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు ఎం. భరత్ లతో పాటు సహచర పార్లమెంట్ సభ్యులతో కలిసి నార్వే పార్లమెంట్ సమావేశాలను ప్రత్యక్షంగా వీక్షించడం గౌరవంగా భావిస్తున్నామని అన్నారు. పాలన, ప్రజా విధానాలు, అంతర్జాతీయ సహకారం వంటి అంశాలపై జరిగిన ఫలవంతమైన ఆలోచనల మార్పిడి విలువైన అవగాహనను అందించడమే కాకుండా, పరస్పర అవగాహనను మరింత బలోపేతం చేసిందని, ఒకరినొకరు అనుభవాల గురించి నేర్చుకుంటూ, భవిష్యత్తులో మరింత బలమైన ద్వైపాక్షిక సంబంధాలను పెంపొందించేందుకు ఎదురుచూస్తున్నామని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.

## వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ డ్రామాలకు ప్రజలే బుద్ధి చెప్పారు.

**వ్యక్తిగత విమర్శలు మానుకోకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయి.**

**వైఎస్ఆర్సిపి బఫూన్లకు సమాధానం చెప్పాల్సిన అవసరం మాకు లేదు : బాబుల్లా.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 03:**
నంద్యాల నియోజకవర్గంలో గత వారం రోజులుగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చేస్తున్న డ్రామాలకు, కుతంత్రాలకు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పూర్తి స్థాయిలో అడ్డుకట్ట వేశారని టిడిపి మైనార్టీ సెల్ నాయకులు బాబుల్లా, మాజీ కౌన్సిలర్ మిద్దె ఉసేని, మాజీ రాష్ట్ర కార్యదర్శి జిల్లెల్ల శ్రీరాములు, డాక్టర్ బాలస్వామి పేర్కొన్నారు. నంద్యాల రాజ్ టాకీస్ ఆవరణలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు తమ ఘోర ఓటమిని తట్టుకోలేక వైసిపి నాయకులు దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని తీవ్రంగా విమర్శించారు. మాజీ శాసనసభ్యులు శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ, ప్రస్తుత నంద్యాల శాసనసభ్యులు మరియు మంత్రి ఎన్ఎండి ఫరూక్ గారి రాజకీయ అనుభవం అంత వయస్సు కూడా రవిచంద్ర కిషోర్ రెడ్డికి లేదని బాబుల్లా ఎద్దేవా చేశారు. ఎన్ఎండి ఫరూక్ నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారని, ఆయన చేసిన అభివృద్ధిని చూసే నంద్యాల ప్రజలు 2024 ఎన్నికల్లో దాదాపు 12 వేల భారీ మెజారిటీతో మళ్లీ గెలిపించారని గుర్తుచేశారు. జగన్ మోహన్ రెడ్డి సమక్షంలో 'టికెట్ నా జేబులో ఉంది, మెజారిటీ ఒక్కటే ముఖ్యం' అని ప్రగల్భాలు పలికిన శిల్పా రవిచంద్ర రెడ్డి కి, ఈరోజు టికెట్, మెజారిటీ రెండూ ఎందుకు పోయాయో ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. నంద్యాల అభివృద్ధిని





నిర్లక్ష్యం చేయడం వల్లే ప్రజలు వారిని తిరస్కరించారని స్పష్టం చేశారు. అభివృద్ధిపై వైసిపి నాయకులకు సవాల్ విసురుతూ, శిల్పా మోహన్ రెడ్డి పేరు మీద ఉన్న శిల్పా వాసవి నగర్‌లో దాదాపు 4,500 కుటుంబాలు నివసిస్తున్నప్పటికీ, గత ఐదేళ్ల వైసిపి పాలనలో అక్కడ కనీసం ఒక రోడ్డు గానీ, ఒక మురికి కాలువ గానీ నిర్మించలేకపోయారని ఆరోపించారు. తాము నంద్యాల ఆవాస్ కమిటీ అధ్యక్షుడి హోదాలో ఉన్నప్పుడు స్వయంగా రోడ్డు వేయమని కోరినా పట్టించుకోలేదన్నారు. కానీ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే మంత్రి ఎన్ఎండి ఫరూక్ శిల్పా వాసవి నగర్ అభివృద్ధి కోసం కోట్ల రూపాయల నిధులను విడుదల చేశారని, చేతల్లో అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తున్నామని అన్నారు. అలాగే పద్మావతి నగర్ రోడ్లు, శ్రీనివాస సెంటర్ నుండి సంజీవనగర్ గేట్ వరకు ఉన్న రోడ్లను గత ప్రభుత్వం ఎందుకు పూర్తి చేయలేకపోయిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నంద్యాల ఎమ్మెల్యే ఫరూక్ మరియు వారి కుమారులు ఫిరోజ్ , ఫయాజ్ గార్లు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటారని . అర్ధరాత్రి ఏ సమస్య వచ్చినా ఫోన్ చేస్తే స్పందించే గుణం నష్యం కుటుంబానిదని అన్నారు. వైసిపి నాయకులకు దమ్ముంటే నంద్యాల వైఎస్ఆర్ సర్కిల్, శ్రీనివాస సెంటర్, శ్యామ్ కాల్వ, సాయిబాబా నగర్ లేదా మెడికల్ కాలేజీ వద్దనైనా తాము చేసిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఒక మైనార్టీ నాయకుడు నంద్యాల ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి కావడం వైసిపి నాయకులకు కడుపుమంటగా మారిందని . గతంలో మైనార్టీ మహిళ (మాబునిసా), నేత (ఇస్సాక్ బాషా) వైసిపి శిల్పా రవి మరియు వైస్సార్సీపీ నాయకులు ఏ విధంగా అవమానించారో ప్రజలందరికీ తెలుసన్నారు . తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ వ్యక్తిగత విమర్శలకు తావివ్వదని, కేవలం ప్రజా సంక్షేమం మరియు అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తుందని స్పష్టం చేశారు. వైసిపి నాయకులు కొందరు బఫూన్లను తీసుకొచ్చి ప్రెస్ మీట్లలో కూర్చోబెట్టి బుజ్జి (రాజేష్) వంటి వారిపై తప్పుడు మాట్లాడించడం సిగ్గుచేటన్నారు. ఎవరి చరిత్ర ఏమిటో తమకు పూర్తి ఆధారాలతో తెలుసని, తాము మాట్లాడటం మొదలుపెడితే వైసిపి నేతలు తలదించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో కూడా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి నంద్యాలలో భవిష్యత్తు లేదని, 2029లో కూడా కూటమి ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సౌభాగ్య, పావని, జోష్న, మంజుల సుబ్బరాయుడు, ఓబుల్ రెడ్డి టిడిపి స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## యూరియా వాడకం పై రైతులకు అవగాహన కల్పించిన వ్యవసాయ అధికారులు.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల రూరల్ జూన్ 03:**




నంద్యాల మండలములోని పెద్దకొట్టాల గ్రామంలో యూరియా మరియు ఇతర ఎరువుల వాడకం పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో నంద్యాల మండల వ్యవసాయ అధికారి ప్రసాద్ రావు పాల్గొని రైతులకు పలు సూచనలు చేయడం జరిగినది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంటలకు ఎరువులను అవసరం మేరకే ఉపయోగించాలని ముఖ్యంగా యూరియా మరియు డి.ఏ.పీ ఎరువులను మోతాదుకు మించి వాడరాదని తెలియజేశారు. అధిక ఎరువుల వాడకం వలన భూసారం కోల్పోయి పంట దిగుబడులపై ప్రభావం చూపుతుందని తెలిపారు. సమతుల ఎరువుల వాడకం ప్రోత్సహించడానికి ఈ ఖరీఫ్ సీజన్ నుండి యూరియా మరియు డి.ఏ.పీ ఎరువులను ఏపీ ఏఐఎంఎస్ ద్వారా పంపిణి చేయడానికి ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఈ ఆప్ నందు గత ఖరీఫ్ కాలంలో సాగు చేసిన పంటల వివరాలు రైతు వారిగా పొందుపరచడం జరిగిందని, అలాగే మండలం లోని ఎరువుల డీలర్లను అనుసందానించడం జరిగిందని, ఏ పంటకు ఎంత మోతాదులో నత్రజని, భాస్వరం వాడాలో దానికి అనుగుణంగా ఎన్ని బస్తాల యూరియా మరియు డి.ఏ.పీ అవసరమో సూచించడం జరిగిందని తెలిపారు. రాబోవు ఖరీఫ్ కాలం నుండి రైతు సేవా కేంద్రాలు, ప్రైవేట్ ఎరువుల డీలర్లు మరియు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల యందు పైన తెలిపిన ఆప్ ద్వారా యూరియా మరియు డి.ఏ.పీ ఎరువులు పంపిణి చేయబడునని వ్యవసాయ అధికారి తెలియజేశారు. ఆప్ ద్వారా ఎరువుల పంపిణీ విధానం గురించి మండలంలోని అన్ని గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఇంకా ఆప్ గురించి పూర్తి సమాచారం కొరకు సమీప రైతు సేవా కేంద్రంను సందర్శించగలరని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకుడు మురళి మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

## ఆత్మకూరులో వైసీపీ కార్యాలయంపై టీడీపీ శ్రేణుల దాడి.!

**..తీవ్రంగా ఖండించిన మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి.**

**ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి తీరుపై శిల్పా చక్రపాణిరెడ్డి తీవ్ర ఆగ్రహం.**

**చిల్లర పనులు, బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదన్న శిల్పా చక్రపాణిరెడ్డి.**

**జిల్లా కలెక్టర్ స్పందించి ఎమ్మెల్యేపై సుమోటోగా కేసు నమోదు చేయాలని డిమాండ్.**

**శిల్పా కుటుంబం ఎవరికీ భయపడదు.. తగ్గేదే లేదంటూ స్ట్రాంగ్ వార్నింగ్.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 03:**
నంద్యాల జిల్లా శ్రీశైలం నియోజకవర్గంలో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ఆత్మకూరులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంపై జరిగిన దాడి తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. టీడీపీ శ్రేణులు, గూండాలు ఈ దాడికి





పాల్పడ్డారంటూ మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. స్థానిక ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి తీరును ఆయన తీవ్రంగా ఖండించారు. చిల్లర రాజకీయాలు, ఉడుత ఊపులకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేసిన చక్రపాణిరెడ్డి.. దాడులు చేస్తే ఇంతటితో ఆగే ప్రసక్తే లేదంటూ 'తేలాలి నేనో.. బుడ్డా రాజశేఖర్ రెడ్డి తేలాలి' అంటూ బహిరంగ సవాల్ విసిరారు. తనపై, తన కుటుంబ సభ్యులపై దుర్భాషలాడి, దాడులకు ఉసిగొల్పిన ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డిపై జిల్లా కలెక్టర్ స్పందించి, సుమోటోగా కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
మరోవైపు, మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి సైతం ఈ ఘటనపై తీవ్రంగా స్పందించారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు ఎంతో సహనంతో ఉన్నప్పటికీ, టీడీపీ నాయకులే కావాలని రెచ్చగొట్టి ప్రశాంత వాతావరణాన్ని భంగం కలిగిస్తున్నారని ఆరోపించారు. మహిళా జిల్లా కలెక్టర్ సమక్షంలోనే ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అసభ్య పదజాలం వాడటం దారుణమన్నారు. శిల్పా కుటుంబం ఎట్టి పరిస్థితుల్లోనూ తగ్గేదే లేదంటూ ఎమ్మెల్యేకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు."

## దోమ కాటు ద్వారా వ్యాపించే మలేరియా వ్యాధి పై అవగాహణ అవసరం.

**..సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి.**

**ఆంధ్ర ప్రగతి డోన్ జూన్ 03:** దోమ కాటు ద్వారా వ్యాపించే మలేరియా వ్యాధికి వ్యతిరేకంగా పోరాడేందుకు మలేరియాను నివారించడానికి మరియు ఈ వ్యాధి వ్యాప్తిని అరికట్టడానికి ప్రతి సంవత్సరం జూన్ 1 నుండి జూన్ 30 వరకు జాతీయ మలేరియా వ్యతిరేక నెలగా పాటిస్తారని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి తెలిపారు.జూన్ నెల మొత్తం మలేరియా నివారణ మరియు చికిత్స కోసం అన్ని పట్టణ మరియు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలందరు అవగాహణ కలిగి ఉండాలి. ఈ వ్యాధిలో ముఖ్యంగా తీవ్రమైన జ్వరం, చలి, వణుకు, వాంతులు, తీవ్రమైన తలనొప్పి వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇలాంటి లక్షణాలు కన్పించిన వెంటనే ఏ మాత్రం నిర్లక్ష్యం చెయ్యకుండా ప్రభుత్వ వైద్యశాలలో వైద్యనిపుణులను సంప్రదిస్తే ఉచితంగా పరిక్షలు చేసి వైద్యం అందిస్తారని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి తెలిపారు. కావున ప్రజలందరు అవగాహణతో తోటి వారికి బంధుమిత్రులకు సలహా ఇచ్చి ప్రభుత్వ వైద్యశాల యందు చికిత్స చేయించి మలేరియా వ్యాధిని నిర్మూలిద్దామని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి తెలిపారు.దోమల నివారణకు కొన్ని జాగ్రత్తలు:-దోమల నిర్మూలనతో మలేరియా వ్యాప్తిని నివారించవచ్చు.



పి. మహమ్మద్ రఫి,సామాజిక కార్యకర్త ,డోన్

దోమల నివారణకై అందరూ కలిసి కట్టుగా కృషి చేయాలి. పరిసరాలను వీలైనంత వరకూ పరిశుభ్రంగా ఉంచుకోవాలి. నిల్వ ఉన్న నీటిలో దోమలు వృద్ధి చెందుతాయి. కాబట్టి నీరు ఎక్కడా నిల్వ ఉండకుండా జాగ్రత్త పడాలి. దోమలు ఇంట్లోకి రాకుండా కిటికీలు, వెంటీలేటర్లకు నెట్ అమర్చుకోవాలి. దోమలు ఉన్నాయనుకున్నపుడు క్రిమి సంహారక మందులు చల్లాలి. దోమతెరలను ఉపయోగించాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. మొక్కల కుండీలు, పూల కుండీలలో నీళ్లు ఎప్పటికప్పుడు మారుస్తూ ఉండాలి. కూలర్లలోని నీటిని ఎప్పటికప్పుడు మారుస్తు ఉండాలి. వాటిలో నీళ్లు తీయడంలో అశ్రద్ధ చేస్తే ఆ నీటిలో దోమలు వృద్ధి చెందేందుకు అవకాశం ఏర్పడుతుంది. ఆహార పదార్థాలపై ఈగలు వాలకుండా మూత పెట్టుకోవాలని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి తెలిపారు.

## లక్ష్మీపురం శంకరయ్య మృతి తీరనిలోటు.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 03:** బనగానపల్లె మండలం టంగుటూరు గ్రామానికి చెందిన శ్రీ లక్ష్మీపురం శంకరయ్య (91) ఈరోజు ఉదయం స్వర్గస్తులైన విషయం ఎంతో బాధాకరం. ప్రస్తుతం నంద్యాల పట్టణంలోని ఎన్జీవోస్ కాలనీలో నివాసం ఉంటున్న ఆయన, నంద్యాలలోని "శ్రీనివాస్ సెంటర్‌లో గల అశ్విని డయాగ్నోటిక్ సెంటర్ రేడియాలజిస్ట్ డాక్టర్ ఎల్. అశ్వన కుమార్ గారి తండ్రిగా అందరికీ సుపరిచితులు."సమాజ సేవ పట్ల అంకితభావం కలిగిన ఎల్. శంకరయ్య తన స్వగ్రామమైన టంగుటూరులో పెద్దమ్మతల్లి అన్నదాన సత్రం కోసం రూ.1 లక్ష విరాళం అందించడంతో పాటు, టంగుటూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో సరస్వతి దేవి విగ్రహ ప్రతిష్ఠకు సహకరించారు. తన కుమారులు, కుమార్తెలను కష్టపడి చదివించి, వారందరూ ప్రభుత్వ ఉద్యోగాలు పొందేలా తీర్చిదిద్దారు. సేవాభావం, దాతృత్వం, కుటుంబ విలువలకు ప్రతీకగా నిలిచిన ఎల్. శంకరయ్య గారి మరణం కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు, గ్రామ ప్రజలకు తీరని లోటు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

## మరణించినా వదలని అవినీతి ఉచ్చు..!

**..ప్రభుత్వ అధికారి చనిపోయినా జీవితభాగస్వామిపై జప్తు చర్యలు కొనసాగుతాయి. -సుప్రీంకోర్టు సంచలన తీర్పు.**

**ఆంధ్ర ప్రగతి న్యూఢిల్లీ జూన్ 03:**
అవినీతి నిరోధక చట్టం కింద విచారణ ఎదుర్కొంటున్న ప్రభుత్వ అధికారి మరణించినంత మాత్రాన, ఆ అధికారి అక్రమంగా సంపాదించిన ఆస్తుల జప్తు ప్రక్రియ ఆగిపోదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. బీహార్ ప్రత్యేక కోర్టుల చట్టం' కింద చేపట్టిన జప్తు చర్యలు ఆ అధికారి జీవితభాగస్వామి (భార్య/భర్త) లేదా వారసుల మీద కొనసాగుతాయని అత్యున్నత న్యాయస్థానం కీలక తీర్పు వెలువరించింది. బీహార్‌కు చెందిన ఒక ప్రభుత్వ అధికారిపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదైంది. ఈ క్రమంలో బీహార్ ప్రత్యేక కోర్టుల చట్టం కింద ఆయన ఆస్తులను జప్తు చేసే ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించింది. అయితే విచారణ జరుగుతున్న



సమయంలోనే సదరు అధికారి మరణించారు. దీంతో, ప్రధాన నిందితుడు మరణించినందున ఆయన ఆస్తుల జప్తు ప్రక్రియను కూడా నిలిపివేయాలని ఆయన భార్య కోర్టును ఆశ్రయించారులి.
జస్టిస్ అభయ్ ఎస్. ఓకా, జస్టిస్ పంకజ్ మిథల్‌లతో కూడిన ధర్మాసనం ఈ కేసులో కీలక వ్యాఖ్యలు చేసింది.
క్రిమినల్ విచారణలో నిందితుడు మరణిస్తే శిక్ష పడకపోవచ్చు కానీ, అక్రమంగా సంపాదించిన ఆస్తులను స్వాధీనం చేసుకోవడం అనేది సివిల్ స్వభావం కలిగిన చర్య. ఇది నిందితుడి మరణంతో ముగిసిపోదు. అవినీతి ద్వారా సంపాదించిన ఆస్తులు ప్రజా ధనంతో సమానం. అధికారి మరణించినా, ఆ ఆస్తులు చట్టవిరుద్ధంగా సంపాదించినవే అయితే వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవచ్చు.
అక్రమ ఆస్తులు ఎవరి చేతుల్లో ఉన్నా (జీవిత భాగస్వామి లేదా వారసులు), జప్తు ప్రక్రియను ఎదుర్కోవాల్సిందేనని కోర్టు స్పష్టం చేసింది. అవినీతిని నిర్మూలించడంలో ఈ తీర్పు అత్యంత కీలకమైనది. ఈ నిర్ణయం వల్ల



నిందితులు మరణించినా, వారి అక్రమ ఆస్తులు వారసులకు దక్కకుండా ప్రభుత్వం స్వాధీనం చేసుకునే వీలు కలుగుతుంది.

## హాస్టల్ వార్డెన్స్ పై అధికారుల మామూలు దంద చేస్తే జైలుకే.

**..ఆర్ ఎస్ యు రాష్ట్ర అధ్యక్షులు ఆకుమల్ల శ్రీధర్ డిమాండ్.**

**ఆంధ్ర ప్రగతి తిరుపతి జూన్ 03:**




రెవల్యూషనరీ స్టూడెంట్ యూనియన్ తిరుపతిలో రాష్ట్ర కార్యవర్గం సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు ఆకుమల్ల శ్రీధర్ మాట్లాడుతూ..రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, బీసీ ఎస్టీ సంక్షేమ హాస్టల్లో వార్డెన్స్ పై అధికారులు ఒక్కొక్క విద్యార్థుల పై ప్రతి నెల 100 రూపాయలు ఇవ్వాలంటూ హాస్టల్ వార్డులను వేధిస్తున్నారు ఇలా చేయడం వలన విద్యార్థులకు పూర్తిస్థాయిలో మెనూ పెట్టలేకపోతున్నామని వార్డెన్స్ తమ ఆందోళన తెలిపారు. అధికారులు మీకు లక్షల్లో జీతాలు వస్తున్నాయి. పేద విద్యార్థులపై మామూలు దందా వసూలు చేస్తే నేరుగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని వార్డెన్స్ ని బెదిరింపు చేస్తే నేరుగా జైలుకే వెళ్తారని హెచ్చరిస్తున్నాము. ఈ కార్యవర్గ సమావేశంలో జాతీయ అధ్యక్షులు రవిశంకర్ రెడ్డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రఘురామ్ రెడ్డి. పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు నరేందర్ రెడ్డి. విజయనగరం జిల్లాఅధ్యక్షులు శాంతి.ప్రకాశంజిల్లాఅధ్యక్షులుఅవినాష్.తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు నూకరాజు చిత్తూరు జిల్లా అధ్యక్షులు కిరణ్. కర్నూలు జిల్లా అధ్యక్షులు ఆదినారాయణ. గుంటూరు జిల్లా అధ్యక్షులు నరేష్ నాయుడు. ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్ చౌదరి. నాయకులు పాల్గొన్నారు